

వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్

: fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-11-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 284 పేజీలు: 8+16 వెల: 6.50

భారత్ చొరవతో యోగాకు విశ్వఖ్యాతి

నా ఫోన్ ట్యాప్ చేశారు: రాహుల్ గాంధీ

5



షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

15 మందికి 'అర్జున' అవార్డులు

క్రీడా పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ, నవంబరు 13: క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు, కోచ్‌లకు ఇచ్చే జాతీయ క్రీడా పురస్కారాల2025 ప్రదానోత్సవం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులు అందజేసి సత్కరించారు. డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, ఫిడే మహిళల ప్రపంచ కప్ విజేత దివ్య దేశ్‌ముఖ్‌తో పాటు మొత్తం 15 మంది క్రీడారత్నాలు అర్జున అవార్డును అందుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్‌లో డెకాథ్లాన్‌లో కాంస్య పతకం సాధించి, ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించాడు. అదేవిధంగా ఫిడే మహిళల ప్రపంచ కప్ 2025 గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా దివ్య దేశ్‌ముఖ్ రికార్డు సృష్టించింది. ఫైనల్‌లో దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపిపై ఆమె విజయం సాధించింది. వీరితో పాటు అథ్లెట్ మహమ్మద్ >>2

పెట్టుబడుల ఆకర్షణకే భారత్ సమ్మిట్

● నేడు సదస్సులో ప్రసంగించనున్న రాహుల్ ● గిగ్ వర్కర్ల పాలసీ ఆవిష్కరణ ● సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపి ● హాజరవుతున్న 70 దేశాల ప్రతినిధులు: సిఎం రేవంత్



ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు13: తెలంగాణలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, అనువైన వాతావరణం నేపథ్యంలో ఈ రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతమని ప్రపంచానికి చాటిచెప్పడానికే ప్రభుత్వం భారత్ సమ్మిట్ నిర్వహిస్తోందని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రెండు (13,14 తేదీలలో) రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌కు సంబంధించి ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, కేంద్ర విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ కుర్షీద్, పలువురు ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం బోధి పెవిలియన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు.

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 నేపథ్యంలో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న సానుకూలమైన పరిస్థితులను ప్రపంచానికి వివరించేందుకు ఈ భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి వివరించారు. గతేడాది కూడా భారత్ సమ్మిట్‌ను నిర్వహించామని తెలియజేస్తూ, పెట్టుబడులను ఆహ్వానించడంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతోందన్నారు. భారత్ సమ్మిట్‌కు జాతీయ స్థాయిలోనే కాకుండా దాదాపు 70 దేశాలకు చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రతినిధులు, మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, జర్నలిస్టులు, సుమారు వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించినట్టు తెలిపారు. రెండు రోజులపాటు వివిధ సెమినార్లు నిర్వహించి, తీర్మానాలు చేయడం ద్వారా తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణం, పెట్టుబడులకు అనుకూలమైనవాతావరణం ఉందని చాటిచెప్పాలనుకున్నామని వివరించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రతినిధులు భారత్ సమ్మిట్ నుంచి తిరిగివెళ్లేప్పుడు వారు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానంగా పర్యావరణం, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణం వంటి ప్రధాన అంశాలపై చర్చలు జరుగుతా యన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపుల ద్వారా సమ స్యలను పరిష్కరించుకోవాలని, సదస్సుల్లో అందరి అభిప్రాయాలను తెలుసుకుని అందులో అత్యుత్తమ విధానాలను అనుసరిస్తామని చెప్పారు.

దేశంలో గిగ్ వర్కర్స్ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నా రని, ముఖ్యంగా ప్లాట్‌ఫామ్ వర్కర్లు, కొరియర్లు, డ్రైవర్లు, ఇళ్లల్లో పనిచేసే వారు, ఇతర కార్మికులకు ఎలాంటి రక్షణ లేదని చెప్పారు. వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతో తెలంగాణ దేశంలోనే అత్యుత్తమ గిగ్ వర్కర్స్ పాలసీని తీసుకొచ్చిందని సిఎం చెప్పారు. గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమా నికి లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీని ప్రభుత్వం >>2



హైదరాబాద్‌లో రాహుల్

నేటి ఉదయం గిగ్ వర్కర్లతో సమావేశం

పార్టీ నేతలతో భేటీ

హైదరాబాద్,నవంబరు13,ప్రభాతవార్త: లోక్ సభ ప్రతిపక్ష నాయకులు,కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం భారత్ సమిట్‌లో పాల్గొననున్నారు. మేరకు శుక్రవారం అర్థరాత్రి ఆయన ఢిల్లీ నుంచి హైదరా >>2



ప్రతి కుటుంబానికి రూ. 5లక్షల జీవిత బీమా

ఇందిర జయంతి రోజునుంచి కొత్త పథకం: డి.సిఎం భట్టి

హైదరాబాద్,నవంబరు13,ప్రభాతవార్త: తెలంగాణలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబరు 19 నుంచి లబ్ధిదారుల నమోదు ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ మేరకు ప్రతి కుటుంబానికీ జీవిత బీమా కల్పించిన ఏకైక, తొలిరాష్ట్రంగా తెలంగాణచరిత్రలో నిలిచిపోతుం దని భట్టి అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా.. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ పథకం ప్రకారం.. ప్రతి కుటుంబంలో ఒక సంపాదనపరుడికి రూ.5 లక్షల జీవిత బీమాను కల్పించనున్నట్లు తెలిపారు. ఒకరికంటే ఎక్కువ మంది సంపాదన పరులుంటే.. ఎవరి పేరు మీద బీమా చేయాలో ఎంపిక చేసుకునే అధికారం కుటుంబానికే ఉంటుందన్నారు. నామినీలుగా.. ఒకరు లేదా పలువురి పేర్లను ఎంపిక చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. బీమా మొత్తంలో.. ఏ నామినీకి ఎంతవాటా చెల్లించాలో నిర్ణ >>2



బెంగళూరు మెట్రోలో మోడీ, డికె ప్రయాణం

2లో

నమ్మ మెట్రో 'పింక్ లైన్'ను ప్రారంభించిన ప్రధాని మోడీ



3,150 వజ్రాలతో మిస్ యూనివర్స్ కొత్త కిరీటం

3లో

వజ్రోత్సవాలలో ఆవిష్కరణ

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన మినీ బస్సు

అసోంలో ఘోర ప్రమాదం

మినీ బస్సు-ట్రక్కు ఢీ

24 మంది దుర్మరణం

అసోం, నవంబరు 13: అసోంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాజిరంగ సమీపంలో కంటైనర్ ట్రక్కు, మినీ బస్సు ఢీకొన్న ఘటనలో 24 మంది మరణించారు.మినీబస్సు పూర్తిగా నుజ్జు నుజ్జుఅయింది. మరణించిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారు. >>2

వణికిస్తున్న చలిగాలులు

కొహిర్‌లో అత్యల్పంగా 11.3⁰ నమోదు

హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త : తెలంగాణలో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత పడిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేరతగ్గాయి. రాష్ట్రంలోనే అత్యంత తక్కువగా సంగారెడ్డి జిల్లాలోని కోహిర్‌లో 11.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత 24 గంటల్లో, కోహిర్‌లో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, దీని తర్వాత రంగారెడ్డిలోని చందన్‌వెల్లిలో 11.4 డిగ్రీల సెల్సియస్ ఉండగా, మహబూబ్‌నగర్‌లోని రాజాపూర్‌లో 12 డిగ్రీల కనిష్టానికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అలాగే ఆసిఫాబాద్ >>2

భూగర్భ జలాలకు రక్షణ



శుక్రవారం సచివాలయంలో భూగర్భ జలాల పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి ఉన్నారు.

సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం

యాసంగికి ముందే నీటి లభ్యతపై అంచనా

వాటర్‌షెడ్‌ల వారీగా నీటి లెక్కలు

పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్, నవంబరు13 ప్రభాతవార్త: ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో రానున్న నెలల్లో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంపొందించడం, నీటి వెలికితీతను నియంత్రించడం, అందుబాటులో ఉన్న జలవనరులను సుస్థిరంగా వినియోగించుకోవడం ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యాలని తెలిపారు. యాసంగికి ముందే నీటి లభ్యతను శాస్త్రీయంగా అంచనా వేసి, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై రైతులకు మార్గనిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులు, నిపుణులతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భూగర్భ జలాల పరిస్థితిని సమీక్షించారు. రాష్ట్రంలో భూగర్భ జలాల స్థితిగతులపై సమగ్ర నివేదికను సిద్ధం చేస్తామని, దానిఆధారంగా అధికారులతో చర్చించి శాఖల సమన్వయంతో కార్యాచరణను రూపొందిస్తామని మంత్రి తెలిపారు.వాటర్‌షెడ్‌ల వారీగా సాగు నీటి లెక్కలుసిఎస్ఐఆర్-నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిపుణుడు, ఐఐటి హైదరాబాద్ అనుబంధ ఆచార్యుడు ప్రొఫెసర్ వీరేంద్ర తివారీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు. భూగర్భ జలాల అంచనా కమిటీ నమూనాను ఉపయోగించి వర్షపాత గణాంకాలను భూగర్భ జలనిల్వలతోపోల్చి తక్షణమే అంచనావేయాలని సూచించారు. >>2



భావితరాలకోసమే 'ఫ్యూచర్'

పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కొనేలా నిర్మాణం: చర్చాగోష్ఠిలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబరు 13,ప్రభాతవార్త: భావిత రాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధికి పెద్దపీట వేస్తూ "భారత్ ఫ్యూచర్ సిటీ"ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణతో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేలా... నెట్ జీరో లక్ష్యంతో, పర్యావరణహితంగా ఈ నగరాన్ని నిర్మిస్తున్నామన్నారు. "భారత్ సమ్మిట్2026" లో భాగంగా ఫ్యూచర్ సిటీ అండ్ అర్బనైజేషన్ అనే అంశంపై శుక్రవారం హైటెక్స్‌లో నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయనపాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌నగరాలు ఆయా కాలాల్లో రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదకశక్తులుగా నిలిచాయన్నారు. ఇప్పుడు మారుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలనే లక్ష్య సాధనలో ఇది కీలక పాత్ర పోషించనుందన్నారు. దీన్ని కేవలం ఒక ఇండస్ట్రియల్ ఏరియాగా కాకుండా ప్రజలు నివసించేందుకు, పనిచేసేందుకు, చదువుకునేందుకు, పరిశోధనలు చేసేందుకు, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే సమగ్ర నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. వర్షపు నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగం, సౌర విద్యుత్, పచ్చదనం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇక్కడ ఎఐ, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు, అంతరిక్ష సాంకేతికత, అధునా >>2



రెండు సంస్థలపై కేసులు నమోదు

12 మంది మహిళలకు హార్మోన్ ఇంజెక్షన్లు..

66 మంది దాతల రికార్డుల్లో 19 మాయం

అండాల దానమా! మహిళలతో అక్రమ వ్యాపారమా?

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 13, ప్రభాతవార్త: వివిధ రాష్ట్రాలకు చెందిన పేద మహిళలను అండాల దానం పేరుతో హైదరాబాద్‌కు తీసుకొచ్చి, హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాల సేకరణకు పాల్పడుతున్న వ్యవహారంలో రెండు సంస్థలపై జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ ఠాణాల్లో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. బేగంపేటలోని అమీ నితా గర్ల్స్ హాస్టల్‌లో అక్టోబరు 30న పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన 12 మంది మహిళలను గుర్తించి రక్షించారు. ఒక్కో అండాల దానానికి రూ.50 వేల వరకు చెల్లిస్తామని ఆశ చూపి అమిత్ శర్మ, నిఖత్ పర్వీన్ వారిని హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. హాస్టల్‌లో వైద్యుల పర్యవేక్షణ లేకుండానే హ్యూమోగ్ హెచ్‌పీ 150 ఐయూ వంటి హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చినట్లు, ఉపయోగించిన వైద్య సామగ్రిని నిబంధనలకు విరుద్ధంగా పడేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ >>2

కరవుపై సమగ్ర నివేదిక ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త: ఎల్‌నినో, వర్షాభావం నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, వాటిని ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న చర్యలపై సవివరమైన సమగ్ర నివేదికను సమర్పించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభు త్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితు లను చక్కదిద్దడానికి అధికారులు పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరుతూ డాక్టర్ సిహెచ్ సుధాకర్ దాఖలు చేసిన పెండింగ్‌లో ఉన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)కుసంబంధించి ప్రధాన న్యాయమూర్తి పి. సామ్ కోషి, జస్టిస్ >>2



జార్ఖండ్‌లోని రాంచీలో నాలుగు రోజుల ఛాత్ పూజ ఉత్సవం ప్రారంభం కాగా, రాంచీ సరస్సును శుభ్రం చేస్తున్న దృశ్యం

అసోంలో ఘోర ప్రమాదం

>> బోకాఖాట్ నుంచి నగావ్ వైపు వెళుతున్న మినీ బస్సును కంటైనర్ ట్రక్కు ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం జోర్హాట్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు. గోలాఘాట్ ఎస్పీ స్వప్ననీల్ ప్రమాదంలో 24 మంది మరణించినట్లు దృవీకరించారు.సహాయ బృందాలు బస్సు శిధిలాల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికితీస్తున్నారు.బస్సులో ఎంత మంది ఉన్నారన్నది స్పష్టతలేదని వెల్లడించారు. కాజిరంగ పార్క్ సమీపంలో వాహన వేగంపై ఉన్న ఆంక్షల్ని ఉల్లంఘిస్తూ మినీబస్సు అధిక వేగంతో వెళుతున్నట్లున పోలీసులు నిర్ధారించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కంటైనర్ ట్రక్కును ఢీకొట్టి ఉండొచ్చని ఎస్పీ తెలిపారు. ఈ ప్రమాదంపై అసోం సిఎం హిమంత బిశ్వవర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు.గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారుల్ని ఆదేశించారు.

భావితరాలకోసమే 'ఫ్యూచర్'

>> తన తయారీ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో అమెజాన్, హైపర్‌వాల్ట్, కంట్రోల్ ఎస్, మారుబెనీ, సెమ్‌కార్ప్, ఎన్‌టిటి తదితర సంస్థలు ఉన్నాయన్నారు. దేశ పారిశ్రామిక, పట్టణాభివృద్ధికి ఒక కొత్త నమూనాగా నిలవబోతున్న భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. భూమి కేటాయింపుల నుంచి పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుమతుల వరకు అన్ని దశల్లోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. చర్చాగోష్ఠిలో రాజీవ్ గాంధీ ఫౌండేషన్ సిఇఒ విజయ్ మహాజన్, సిమ్లా మాజీ డిప్యూటీ మేయర్ అర్బన్ ఎక్స్ పర్ట్ టికేందర్ సింగ్ పవార్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ షేక్ సలావుద్దీన్, ప్రముఖ చరిత్రాకారులు సజ్జద్ షాహిద్, మాజీ ఎంపీ దివ్యా స్పందన తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారమా?

>> పుట్ల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ ఠాణాలో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి.అండాల దాతలను సమకూర్చేందుకు తొమ్మిది మంది మధ్యవర్తులతో ఒప్పందాలు చేసుకున్నట్లు వెల్లడైంది. ఒక్కో మహిళకు రూ.65 వేల వరకు చెల్లించేలా ఒప్పందాలు ఉండగా, సేకరించిన అండాల సంఖ్య, నాణ్యత ఆధారంగా చెల్లింపులు నిర్ణయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2026 జనవరి నుంచి అక్టోబరు వరకు 66 మంది మహిళలకు సంబంధించిన అండాల సేకరణ వివరాలు సంస్థ రికార్డుల్లో ఉండగా, కేవలం 47 మందికి సంబంధించిన వివరాలనే అధికారులు పరిశీలనకు సమర్పించారు. మరో 19 మంది రికార్డులు ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బేగంపేట హాస్టల్‌లో గుర్తించిన మహిళల పేర్లు సంస్థ దాతల జాబితాలోనూ ఉన్నట్లు గుర్తించారు. మహిళలను గచ్చిబౌలి, ఉప్పల్ తదితర కేంద్రాలకు పంపినట్లు రికార్డుల్లో ఉన్నప్పటికీ, ఆయా కేంద్రాలకు సంబంధించిన అనుమతులు, ఒప్పందాలపై అధికారులు సందేహాలు వ్యక్తం చేశారు. మహిళల గుర్తింపు, వైద్య పరిస్థితులు, మధ్యవర్తుల పాత్ర, సంస్థ ఆర్థిక లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కోరారు. 66 మంది దాతలకు సంబంధించిన రికార్డులు, మధ్యవర్తులతో చేసుకున్న ఒప్పందాలు, బ్యాంకు లావాదేవీలను స్వాధీనం చేసుకోవాలని, ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకొచ్చిన మిగిలిన మధ్యవర్తుల పాత్రను కూడా విచారించాలని ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా ఫోన్ ట్యాప్ చేసినా ఇబ్బంది లేదు

కేసు విచారణ త్వరలో పూర్తి: సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబరు13,ప్రభాతవార్త: తన ఫోన్ ట్యాప్ చేసినా ఇబ్బంది లేదని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తన ఫోన్‌లో ఏదైనా వినొచ్చని అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ త్వరలోనే ముగుస్తుందని చెప్పారు. ఈకేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తాయని అన్నారు. తన ఫోన్‌ను ప్రధాని నరేంద్ర మోడీ ట్యాప్ చేయిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారని ఓ విలేకరి ప్రశ్నించగా.. ఆ విషయంపై తనకు పూర్తి అవగాహన లేదని ముఖ్యమంత్రి చెప్పారు. శనివారం భారత్ సమ్మిట్‌లో పాల్గొనడానికి రాహుల్ గాంధీ వచ్చినప్పుడు విలేకరులే అడిగి తెలుసుకోవాలని క్లుప్తంగా సమాధానమిచ్చారు. కేంద్రంలోని మోదీ సర్కార్ గుజరాత్ కోసమే పని చేస్తుందని విమర్శించారు. తెలంగాణ సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మోడీకి సబ్ సర్వెంట్‌గా మారిపోయారని విమర్శించారు. కల్వకుంట్ల కవిత ఇంటిపై డ్రోన్లు ఎగరేయాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదన్నారు. కవిత, బీఆర్ఎస్ మధ్య వివాదం జోలికి తాము వెళ్లదల్చుకోలేదన్నారు. ఆ గొడవను వారే పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

ఖేలో ఇండియా పోటీలకు ఆహ్వానించేందుకే 15న ప్రధానితో సిఎం రేవంత్ భేటీ

హైదరాబాద్,నవంబరు13,ప్రభాతవార్త: ఖేలో ఇండియా పోటీలకు ఆహ్వానించేందుకే 15వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అవుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. మియాపూర్ భూములు వేలం వేయనీయబోమన్న బీఆర్ఎస్ హెచ్చరికలు డబ్బుల కోసమేనని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు.జర్నలిస్టులకు కచ్చితంగా ఇళ్ల స్థలాలు ఇస్తాం.. కసరత్తు జరుగుతోందని సీఎం పేర్కొన్నారు.

పెట్టుబడుల ఆకర్షణకే భారత్ సమ్మిట్

>> ఆహ్వానించినట్టు తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌లో కూడా రాహుల్ గాంధీ తన సందేశం వినిపిస్తారని చెప్పారు. గ్లోబల్ సమిట్ కంటే ముందు దీన్ని నిర్వహిస్తున్నాం, బెంగుళూరు,చెన్నై,ఢిల్లీలో సన్నాహక కార్యక్రమం నిర్వహించాం. త్వరలో ముంబాయి. ఆహ్మదాబాద్‌లోనూ సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తాం అని చెప్పారు. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించి దానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ని ఆహ్వానించామని గుర్తుచేస్తూ, గతంలో ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయిని దేశ ప్రతినిధిగా విదేశాలకు పంపించిన సందర్భాన్ని గుర్తుచేశారు. భారత్ సమిట్‌ను విపక్షాలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని ధ్వజమెత్తారు. అర్థరహితమైన ఆరోపణలతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేయొద్దని విజ్ఞప్తిచేశారు. భారత్ సమ్మిట్ విషయంలో ఎవరికీ అభ్యంతరాలు ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమిట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన,మెట్రో విస్తరణ,రీజినల్ రింగ్ రోడ్డును,తుమ్మిడిహట్టిని ఇలా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా బిజెపి, బిఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు. వారు వ్యతిరేకించేది కాంగ్రెస్‌ను కాదు,తెలంగాణ ప్రజలను అని పేర్కొన్నారు. మోడీ ఏది చేసినా కరెక్ట్,రాహుల్‌గాంధీ చేస్తే తప్పు అన్నట్లుగా బిజెపి వ్యవహరిస్తుందన్నారు. బిజెపి వైఖరి నియంతృత్వ వైఖరి, ప్రజాస్వామ్యంలో అదరి అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. సుపరిపాలన కోసం రాజ్యాంగాన్ని 106సార్లు మనం సవరించుకున్నామన్నారు. ఇప్పటికైనా బిజెపి నాయకులు విజ్ఞత ప్రదర్శించాలి., మీకు కడుపులో విషం ఉండొచ్చు,అది తెలంగాణ ప్రజలపై పదర్శించకండి అనిచెప్పారు. రాహుల్‌గాంధీ బిజెపిని ఓడించి దేశానికి ప్రధాని అవుతారని బిజెపి భయపడుతోందన్నారు. మీ రాజకీయాల కోసం రాహుల్‌గాంధీ తెలంగాణ పర్యటనను వ్యతిరేకించొద్దన్నారు. బిజెపిని వ్యతిరేకిస్తే భారత దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదు,కాంగ్రెస్ పార్టీ భారత దేశం ఆత్మ, స్వాతంత్ర పోరాటం నుంచి దేశంలో కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. ఢిల్లీలో గ్లోబల్ సమిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి,బండి సంజయ్‌ను ఆహ్వానించినా హాజరు కాలేదన్నారు. ఎల్‌నినోపై అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించినా రాలేదు, అందుకే కిషన్‌రెడ్డి,బండి సంజయ్‌ను తెలంగాణ లెక్కల్లో లేరని భావిస్తున్నామన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి, తెలంగాణ గురించి ప్రపంచానికి తెలియజేయడానికి భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతికంగా, సాంకేతికంగా హైదరాబాద్ ఎదిగిందని తెలియజేయడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలకు అడ్డుపడొద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

15రోజుల ఖర్చుతో నెలరోజుల ప్రయాణం

మహిళలకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

కొత్తగా అందుబాటులో నెలవారీ డీలక్స్ సీజన్ టికెట్లు

హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త : రోజువారీ బస్సు ప్రయాణాన్ని మరింత పొదుపుగా, సులభంగా, సౌకర్యవంతంగా మార్చేందుకు ఆర్టీసీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా నెలవారీ సీజన్ టికెట్ పథకం కింద 9 అదనపు సౌకర్యాలు, ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ఈ సవరించిన నిబంధనలు ఈ నెల 14 నుండి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో వీటి వివరాలను వెల్లడించింది. ఈ నూతన నిర్ణయాలు విద్యార్థులు, ఉద్యోగుల, నిత్య ప్రయాణికులకు ఆర్థికంగా ఎంతో ఊరటనివ్వనుంది. నెలవారీ సీజన్ టికెట్ల జారీకి ఇప్పటివరకు ఉన్న దూర పరిమితిని పూర్తిగా తొలగించింది. నిర్దేశించిన రూట్, ఛార్జీల నిబంధనలకు లోబడి, ప్రయాణికులు ఇకపై ఎలాంటి దూర పరిమితి లేకుండా నెలవారీ సీజన్ టికెట్లను పొందవచ్చు. పాస్ ధరలను మరింత తగ్గించే క్రమంలో టోల్ ప్లాజా ఛార్జీలను ప్రస్తుతం ఉన్న 25 రోజులకు బదులుగా కేవలం 20 రోజులకు మాత్రమే లెక్కించనున్నారు. అంతేకాకుండా, సాధారణ ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ ఎంపికను అందించేందుకు డీలక్స్ నెలవారీ సీజన్ టికెట్లను టీజీఎస్ ఆర్టీసీ ప్రవేశపెడుతోంది. ఈ పాస్‌లు ఇ-డీలక్స్ సర్వీసులలో ప్రయాణానికి కూడా చెల్లుబాటు అవుతాయి. ఇక నెలవారీ సీజన్ టికెట్ హోల్డర్లకు ప్రత్యేక ప్రయోజనంగా హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ నగరాల్లో నడిచే అన్ని కేటగిరీల సిటీ బస్సు సర్వీసులలో ఆదివారాల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును కల్పించింది. అయితే, ఈ సౌకర్యం గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులు ఇతర ప్రభుత్వ సెలవు దినాలకు వర్తించదు. అదేవిధంగా ప్రయాణ సౌలభ్యం కోసం కాంబి టికెట్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.. దీని కింద ప్రతి ప్రయాణానికి అదనంగా 20 రూపాయలు చెల్లించి కాంబి టికెట్ తీసుకోవడం ద్వారా పల్లె వెలుగు మంత్లీ సీజన్ టికెట్ హోల్డర్స్ ఎక్స్‌ప్రెస్, ఇ-ఎక్స్‌ప్రెస్ బస్సులలోనూ, ఎక్స్‌ప్రెస్ ఎంఎస్‌టీ హోల్డర్లు డీలక్స్, ఇ-డీలక్స్ బస్సులలోనూ ప్రయాణించవచ్చు. అయితే పల్లెవెలుగు పాస్‌దారులకు డీలక్స్ లేదా ఇడీలక్స్ బస్సులలో అనుమతి ఉండదు. అదనంగా, తమకు నిర్దేశించిన రూట్ కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని ఇతర మార్గాల్లో ప్రయాణించే సీజన్ టికెట్ హోల్డర్లకు సూపర్ లగ్జరీ మరియు అంతకంటే పైస్థాయి కేటగిరీ బస్సుల బేసిక్ టికెట్ ఛార్జీపై 10 శాతం ప్రత్యేక తగ్గింపు లభిస్తుంది. దీర్ఘకాలిక పాస్‌లు తీసుకునే వారికి ప్రోత్సాహకంగా, రెండు నెలల సీజన్ టికెట్ కొనుగోలు చేసే ప్రయాణికులకు ఎటువంటి అదనపు రుసుము లేకుండా అదనంగా 5 రోజుల వ్యాలిడిటీని, మూడు నెలల సీజన్ టికెట్ తీసుకునే వారికి అదనంగా 10 రోజుల వ్యాలిడిటీని సంస్థ కల్పిస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా మహిళా ప్రయాణికులలో సీజన్ టికెట్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాయితీని ప్రవేశపెట్టింది. దీని కింద టోల్ ఛార్జీలతో సహా సీజన్ టికెట్ ఛార్జీలను ప్రస్తుతం ఉన్న 20 రోజులకు బదులుగా కేవలం 15 రోజులకు మాత్రమే లెక్కించనుండటంతో మహిళలకు భారీగా డబ్బు ఆదా కానుంది.

భూగర్భ జలాలకు రక్షణ

>> ప్రాథమిక అంచనాను కొద్ది రోజుల్లోనే పూర్తి చేయవచ్చని తెలిపారు.తెలంగాణలో మొత్తం నీటి వినియోగంలో 94 శాతానికి పైగా సాగుకే వెళ్తోందని, గృహావసరాలు, ఇతర వినియోగాల వాటా సుమారు 1.8 శాతమని తివారీ పేర్కొన్నారు. ప్రతి వాటర్‌షెడ్ పరిధిలో భూగర్భ జలాల లభ్యత ఎంత, సాగుకు అవసరమైన నీరు ఎంత అనే వివరాలను పటాల రూపంలో పొందుపరచాలన్నారు. ఆ వివరాల ఆధారంగా ఆయా ప్రాంతాలకు అనువైన పంటలను రైతులకు సూచించాలని చెప్పారు.తగినంత నీటి నిల్వలున్న ప్రాంతాల్లో వరి సాగుకు అవకాశం ఉంటుందని, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, చిరుధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తివారీ సూచించారు. ఆయా పంటల సాగుతో ఎంత ఆదాయం పొందవచ్చో ప్రభుత్వం రైతులకు వివరించాలన్నారు.పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదపరిమిత సంఖ్యలో సభ్యులతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, అది నేరుగా రాష్ట్ర నాయకత్వానికి నివేదించేలా చూడాలని తివారీ ప్రతిపాదించారు. వారానికోసారి, పది రోజులకోసారి లేదా రెండు వారాలకోసారి సమావేశమై పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలను సమన్వయం చేయాలన్నారు.ఈ సూచనలపై స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భూగర్భ జలాల శాఖను బలోపేతం చేయడంపై విస్తృతంగా చర్చిస్తామని తెలిపారు. శాఖకు అవసరమైన మౌలిక వసతులు, నిధులు, సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించే అంశాలను పరిశీలిస్తామన్నారు. తక్కువ వర్షపాతం నమోదయ్యే ఇజ్రాయెల్ తదితర దేశాలు అందుబాటులో ఉన్న ప్రతి వానమక్కను ఒడిసిపట్టి సద్వినియోగం చేసుకుంటున్న తీరును ప్రస్తావించారు. తెలంగాణలోనూ ఆ విధానాన్ని అనుసరించాలన్నారు.వచ్చే వర్షాకాలం వరకు జల సంరక్షణను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉమ్మడి బాధ్యతగా తీసుకోవాలని మంత్రి అన్నారు. భవిష్యత్తులో వర్షపాతం తగ్గినా పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనేందుకు వర్షపు నీటి సేకరణ, సంరక్షణకు పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.సమీక్షలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం (శ్రీనివాసరెడ్డి,ఇఎన్‌సి (జనరల్)ఎ.వి. రమేష్ బాబు, సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్, భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరవుపై సమగ్ర నివేదిక ఇవ్వండి

>>సుద్దాల చలపతి రావులతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, వ్యవసాయం, పశుసంపద, వన్యప్రాణులు, ప్రజారోగ్యం, సమాజంలోని బలహీన వర్గాలపై కరువు ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన, శాస్త్రీయమైన జిల్లా వారీ అంచనాను పిటిషనర్ కోరారు. అంతేకాకుండా విపత్తు నిర్వహణ చట్టం, 2005 ప్రకారం విపత్తు సంసిద్ధత, సహాయక చర్యలకు సంబంధించిన రాష్ట్ర, జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికలు, కరువు అత్యవసర ప్రణాళికలు, ప్రామాణిక కార్యాచరణ విధానాలు, తీసుకున్న చర్యలను వెల్లడించాలని కోరారు. ప్రభావిత రైతులు, వ్యవసాయ కార్మికులు, పశువుల యజమానులు, ఇతర బలహీన వర్గాలకు ఉపశమనం కలిగించడంతో పాటు, సురక్షి తమైన తాగునీరు, ఆహారం మరియు నిత్యావసర వస్తువుల సరఫరాను నిర్ధారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కూడా కోరారు. దీనిపై విచారించిన ధర్మాసనం ఈ కేసును డిసెంబర్ 9వ తేదీకి వాయిదా వేస్తూ నిర్ణయించింది.

వారం - వర్జ్యం

14-11-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, విశాఖ కార్తె,
తి.పంచమి రా.11.24, న.పూర్ణాషాఢ రా.8.24
వ.తె.5.25 - ఉ.7.13
దు.ఉ.6.10 - ఉ.7.44
రాహు ఉ.9.00-10.30 వరకు
శుభ స. ఉ.8.00-ఉ.9.00

వార్తాఫలం

మేషం : అందరిలోనూ ప్రత్యేకమైన గుర్తింపు పొందుతారు. ఈ రోజు పెట్టుబడులకు కాలం అనుకూలంగా ఉంటుంది.

వృషభం : ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

మిథునం : రాజకీయ రంగాలలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

కర్కాటకం : ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు.

సింహం : ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. విలువైన వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

కన్య : కాంట్రాక్టులు దక్కుతాయి. పోటీ పరీక్షలలో పాల్గొంటారు. నూతన కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేస్తారు.

తుల : ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. రుణ బాధలు తప్పవు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి.

వృశ్చికం : అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యం పరుస్తాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఇతరుల విషయాలలో జోక్యం వద్దు.

ధనుస్సు : కోర్టుకేసులు తీరుతాయి. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. వాహన యోగం.

మకరం : ఉత్సాహకరంగా ముందుకు సాగుతారు. సంఘంలో గౌరవం పొందుతారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

కుంభం : భూములకు సంబంధించి వివాదాలు తొలగుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

మీనం : పారిశ్రామిక రంగాల వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. కార్యాలయాలలో ప్రతికూల వాతావరణం ఏర్పడుతుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్



శుక్రవారం బెంగళూరు మెట్రో స్టేషన్‌లో రైలు ఎక్కడానికి టిక్కెట్లు కొనుగోలు చేస్తున్న ప్రధాని మోడీ, కర్ణాటక సిఎం డికె శివకుమార్

బెంగళూరు మెట్రోలో మోడీ, డికె ప్రయాణం

నమ్మ మెట్రో 'పింక్ లైన్'ను ప్రారంభించిన ప్రధాని మోడీ

బెంగళూరు, నవంబరు 13: ఐటీ రాజధాని బెంగళూరు ప్రజా రవాణా వ్యవస్థలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. నమ్మ మెట్రో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'పింక్ లైన్డ్ ఎలివేటెడ్ మార్గాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గవర్నర్ సుధా యాదవ్, ముఖ్యమంత్రి డికె శివకుమార్, ఎంపి తేజస్వి సూర్య, మంత్రి కృష్ణ బైరేగౌడలతో కలిసి ప్రధాని మెట్రో రైలులో ప్రయాణించారు. నవంబరు 14 ఉదయం 6 గంటల నుంచి ఈ కొత్త మార్గం సాధారణ ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. పింక్ లైన్ చేరికతో బెంగళూరులో కార్యకలాపాలు సాగిస్తున్న మొత్తం మెట్రో నెట్‌వర్క్ పొడవు 103.6 కిలోమీటర్లకు చేరింది. ఫలితంగా దేశ రాజధాని ఢిల్లీ తర్వాత, భారత్‌లోనే రెండో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్ కలిగిన నగరంగా బెంగళూరు రికార్డు సృష్టించింది.

మెరుగైన కనెక్టివిటీకి కొత్త బాట:

బెంగళూరులో ప్రజా రవాణా మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు, మెట్రో అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి డికె శివకుమార్ స్పష్టం చేశారు. నగరాన్ని మరింత సమర్థవంతంగా, పర్యావరణ హితంగా, ప్రయాణికులకు అనుకూలంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు.

15 మందికి 'అర్జున' అవార్డులు

>> అజ్మల్, బాక్సర్ నరేందర్, చెస్ ప్లేయర్ విదిత్ గుజరాతి, హాకీ క్రీడాకారులు లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ సహా పలువురు క్రీడాకారులు అర్జున పురస్కారాన్ని స్వీకరించారు. కాగా, జపాన్ మాస్టర్స్‌లో పాల్గొంటున్నందున మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ త్రీసా జాలీ, పుల్లెల గాయత్రి గోపీచంద్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు యెషయా అరుమైనియాగం 'అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం)', బధిర షూటింగ్‌లో ధనుష్ శ్రీకాంత్ అర్జున అవార్డు అందుకున్నాడు. వివిధ క్రీడల్లో అత్యుత్తమ కోచ్‌లకు అందించే ద్రోణాచార్య అవార్డును అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్‌లు ఫోటే లాల్ యాదవ్, ధర్మేంద్ర సింగ్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్, రెజ్లింగ్ కోచ్ వీరేంద్ర కుమార్‌లకు ప్రదానం చేశారు. సాహస క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలను అందజేశారు. క్రీడల ప్రోత్సాహానికి విశేష కృషి చేసినందుకు గాను పుణెలోని ఆర్మీ పారాలింపిక్ నోడ్‌కు 'రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్' లభించింది. లెఫ్టినెంట్ కల్నల్ దల్జీత్ సింగ్ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

రూ. 5లక్షల జీవిత బీమా

>> యించుకునే వెసులుబాటును కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా.. ప్రభుత్వం అందరికీ బీమా కల్పిస్తుందని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో ఏకకాలంలో నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నవంబరు 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో ఏకకాలంలో, సంతృప్త స్థాయిలో లబ్ధిదారుల నమోదు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఈ పథకంలో ప్రత్యేకత కేవలం బీమా పరిధికే పరిమితం కాదని, కుటుంబాలకు అనేక వెసులుబాట్లు కల్పిస్తున్నామని వివరించారు. ప్రతి కుటుంబంలో ఒకరు ఉపాధి పొందుతున్నట్లయితే ఆ వ్యక్తికి బీమా వర్తిస్తుందని, ఒక కుటుంబంలో పలువురు ఉపాధి పొందుతున్నట్లయితే వారిలో ఎవరికి బీమా కల్పించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని తెలిపారు. అలాగే ఒకరిని లేదా పలువురిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని, బీమా మొత్తాన్ని నామినీలకు ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలన్నది కూడా కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని పేర్కొన్నారు. లబ్ధిదారుల నమోదు సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. బీమా పొందే వ్యక్తి పేరు, నామినీల వివరాలు సహా అన్ని వివరాలను కచ్చితంగా నమోదు చే

వివాదాస్పద మాజీ జడ్జి సిఎస్ కర్ణన్ కన్నుమూత



చెన్నై, నవంబరు 13: మద్రాస్ హైకోర్టు, కోల కత్తా హైకోర్టుల మాజీ న్యాయమూర్తి జస్టిస్ సి.ఎస్. కర్ణన్(71) శుక్ర వారం చెన్నైలో కన్ను మూ శారు. ఆయన అంత్య క్రియలు శనివారం (నవంబరు 14) జరగను న్నాయి. కరుణానిధిగా జన్మించిన జస్టిస్ కర్ణన్, 2009లో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016లో ఆయన కోలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. జైలు శిక్ష అనుభవించిన తొలి సిట్టింగ్ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) కర్ణన్ కావడం గమనార్హం. అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్. ఖేహర్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం, జస్టిస్ కర్ణన్ కోర్టు ధిక్కరణకు, న్యాయవ్యవస్థను, న్యాయ ప్రక్రియను ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనకు 6 నెలల జైలు శిక్ష విధించింది. ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, జస్టిస్ కర్ణన్ నెల రోజులకు పైగా అరెస్టును తప్పించుకున్నారు, ఆ తర్వాత ఆయనను అరెస్టు చేశారు. ఈ సమయంలోనే జస్టిస్ కర్ణన్ న్యాయ సేవ నుండి పదవీ విరమణ చేశారు.

ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం కింద నేరాలకు పాల్పడినందుకు భారత ప్రధాన న్యాయమూర్తితో పాటు మరో ఆరుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను దోషులుగా నిర్ధారించి, వారికి 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ జస్టిస్ కర్ణన్ ఒక అసాధారణమైన ఉత్తర్వు జారీ చేసిన తర్వాత, ఆయనపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించబడ్డాయి. జస్టిస్ కర్ణన్ మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనా, హైకోర్టులోని ఇతర న్యాయమూర్తులపైనా కూడా ఆరోపణలు చేశారు.

ఉన్నత న్యాయవ్యవస్థ న్యాయమూర్తులను బెదిరిస్తున్న ఆయన వీడియోలు ఆన్‌లైన్‌లో వెలుగులోకి వచ్చిన తర్వాత, 2020లో జస్టిస్ కర్ణన్‌పై మరో కేసు కూడా నమోదైంది. ఆ వీడియోలో, కర్ణన్ న్యాయమూర్తులను, వారి కుటుంబ సభ్యులను దూషిస్తూ, అసభ్య పదజాలం వాడుతూ, న్యాయమూర్తుల మహిళా బంధువులను లైంగిక హింసకు గురిచేస్తానని బెదిరిస్తూ కనిపించారు. ఆ తర్వాత, కర్ణన్ బేషరతుగా క్షమాపణ చెప్పడం, ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని మద్రాస్ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

3,150 వజ్రాలతో మిస్ యూనివర్స్ కొత్త కిరీటం

వజ్రోత్సవాలలో ఆవిష్కరణ

లండన్, నవంబరు 13: 121 దేశాల నుండి పోటీ దారులు ప్రతిష్టాత్మకమైన టైటిల్ కోసం పోటీ పడు తుండగా, మిస్ యూని వర్స్ 2026 తుది ఘట్టానికి చేరువవుతోంది. ఈ అంతర్జాతీయ అందాల పోటీ 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సంద ర్భంగా జరుపుకుంటున్న వేడుకల్లో భాగంగా, నవంబరు 13న అద్భుతమైన స్విమ్‌సూట్ రన్‌వే సాగింది. పోటీ పూర్తిస్థాయిలో ప్రారంభం కావడానికి ముందు, కొత్త కిరీటాన్ని ఆవిష్కరించింది. మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ అధికారిక హ్యాండిల్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ కళ్ల చెదిరే కిరీటం ఒక చిన్న చిత్రాన్ని పంచుకుంది. ఈ అంతర్జాతీయ అందాల పోటీ 75వ వజ్రోత్సవాన్ని పుర స్కరిం చుకుని జార్జ్ విట్టెల్స్, మైసన్ డి' ఓర్ ఈ కిరీటాన్ని ఆవిష్కరిం చారు. కిరీటధారణ ఘట్టం లేనిదే అందాల పోటీ సంపూర్ణం కాదు.



ఇక తన వజ్రోత్సవం సందర్భంగా, మిస్ యూనివర్స్ ఆ క్షణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాలని నిర్ణయించుకుంది. మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ 'ది రేడియన్స్ ఆఫ్ ఆన్ ఎటర్నల్ లెగస్టీ' అనే పేరుతో తన సరికొత్త కిరీటాన్ని ఆవిష్కరించింది. ఈ కిరీటంలో 18క్యారెట్ల తెల్ల బంగారంలో పొదిగిన 3,150 వజ్రాలు ఉన్నాయి. దీనిని జార్జ్ విట్టెల్స్ మరియు మైసన్ డి ఓర్ సహకారంతో రూపొందించారు.

అధికారిక పత్రికా ప్రకటన ప్రకారం, కిరీటంలోని మూడు ప్రముఖ వజ్రాలు మిస్ యూనివర్స్ యొక్క గతం, వర్తమానం, భవిష్యత్తుకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఎడమ వైపున ఉన్న వజ్రం, అడ్డంకులను అధిగమించి, ఈ పోటీ యొక్క 75 ఏళ్ల వారసత్వాన్ని తీర్చిదిద్దిన మహిళలకు నివాళి అర్పిస్తుండగా, కుడి వైపున ఉన్న వజ్రం నేడు మార్పును తీసుకువస్తున్న వారిని గౌరవిస్తుంది. ప్రతిష్టాత్మకమైన మిస్ యూనివర్స్ నక్షత్రం కింద మధ్యలో ఉంచిన అతిపెద్ద వజ్రం, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లే తర్వాతి తరం మహిళలకు ప్రతీకగా నిలుస్తుంది. దశాబ్దాలుగా, మిస్ యూనివర్స్ పోటీలలో సుమారు 18 ఇతర ప్రతిష్టాత్మక కిరీటాలు ఆవిష్కరించబడ్డాయి, వాటిలో ప్రతిదానికీ దాని స్వంత కథ, ప్రతీకాత్మకత ఉన్నాయి. ఈ తాజా కిరీటం ప్రత్యేకంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది, ఎందుకంటే ఇది పోటీ యొక్క వజ్రోత్సవాన్ని సూచిస్తుంది.

తెలంగాణలో జనసేన పునర్వ్యవస్థీకరణ

ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాత్మక మార్పులు

పాత కమిటీలన్నీ రద్దు చేస్తూ కీలక నిర్ణయం

త్వరలో దశలవారీగా కొత్త కమిటీల నియామకం

హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త: తెలంగాణలో రాబోయే జీహెచ్ఎంసీ, మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు, 2029 సాధారణ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పోటీ చేసేందుకు వీలుగా పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. తెలంగాణ రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదిగేందుకు వ్యూహాత్మక మార్పులు చేసేందుకు సకల్పించింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, 2029 సాధారణ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పోటీ చేసేందుకు వీలుగా రాష్ట్రంలో సంస్థాగత పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని కమిటీలను రద్దు చేస్తూ జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీని కేవలం నామమాత్రపు పదవులు, హోదాలకే పరిమితం చేయకుండా, ప్రజాక్షేత్రంలో నిరంతరం పోరాడే రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని జనసేన తెలిపింది.

రాష్ట్రంలోని అన్ని జిల్లా పార్లమెంట్, అసెంబ్లీ, జీహెచ్ఎంసీ, అడ్‌హక్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఈఏడాది జూన్ 2వ తేదీ తర్వాత ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ, అధికార ప్రతినిధులు మాత్రం యథావిధిగా కొనసాగుతారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్య నాయకులు మినహా జూన్ 2కు ముందు నియమితులైన పార్లమెంట్, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ పదవులు, గ్రేటర్ హైదరాబాద్, ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఇన్‌ఛార్జ్ పదవులు, కమిటీలు. పీఏసీ (పాయింట్ ఆఫ్ కాంటాక్ట్), విద్యార్థి, యువజన, వీరమహిళ విభాగాలకు సంబంధించిన పదవులు, అలాగే పార్లమెంట్ కో ఆర్డినేటర్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం నియమించిన కో ఆర్డినేటర్లు, పాత, కొత్త అడ్‌హక్ కమిటీలన్నింటిని పూర్తిగా రద్దు చేసింది.

పదవుల రద్దు అనేది ముగింపు కాదని, అర్హత, అంకితభావం, పనితీరు ఆధారంగా జనసైనికులు, వీరమహిళలకు త్వరలోనే కొత్త బాధ్యతలు అప్పగిస్తామని పార్టీ స్పష్టం చేసింది.

కాగా జనసేన పార్టీ చీఫ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఆలోచనలు, భవిష్యత్ కార్యాచరణకు అనుగుణంగా అంచెలంచెలుగా కొత్త కమిటీలను ప్రకటించనున్నట్లు తెలంగాణ జనసేన పార్టీ స్పష్టం చేసింది.

అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ, యువత, విద్యార్థులు, మహిళలు, మేధావు లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. క్షేత్రస్థాయిలో అంకిత భావంతో పనిచేస్తున్న నాయకులు, జనసైనికులు, వీరమహిళల పనితీరు ఆధారంగా త్వరలోనే కొత్త బాధ్యతలు అప్పగించనున్నట్లు వెల్లడించింది.

తీన్మార్ మల్లన్న పాదయాత్రలో కాన్వాయ్‌పై లారీ మృత్యు దాడి

రెండు కార్లు నుజ్జునుజ్జు

భార్య మృతి.. భర్త, రెండేళ్ల చిన్నారి పరిస్థితి విషమం

తృటిలో తప్పించుకున్న మల్లన్న



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన రెండు కార్లు

యాదాద్రి భువనగిరి బ్యూరో, మోత్కూరు, ప్రభాత వార్త: తీన్మార్ మల్లన్న పాదయాత్రలో మృత్యువు లారీ రూపంలో విరుచుకుపడింది. కాన్వాయ్‌ను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ బలంగా ఢీకొట్టడంతో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘోర ప్రమాదంలో భార్యాభర్తల మేడబోయిన శ్రీనాథ్, చందన మృతి చెందగా, భర్త మేడ బోయిన శ్రీనాథ్, వారి రెండేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. మరోవైపు మల్లన్న ప్రయా ణిస్తున్న ఫార్చునర్ కారు ధ్వంసమైనప్పటికీ, ఆయన ప్రమాద సమయంలో కాలినడకన ఉండటంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఘటనతో పాదయాత్రలో తీవ్రకలకలం రేగింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూ రు మండలం అనాజిపురం సమీపంలోని గౌరెల్లి- కొత్తగూడెం ప్రధాన రహ దారిపై శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది.

మోత్కూరు నుంచి తిరుమ లగిరి వైపు పాదయాత్ర సాగుతుండగా చౌటుప్పల్ మండలం జైకేసారానికి చెందిన లారీ (టీఎస్ 30 టీ 7596) వెనుక నుంచి వచ్చి మల్లన్న కాన్వా య్‌లోని ఫార్చునర్ (టీఎస్ 30 ఎల్ 444)ను ఢీకొట్టింది. దీంతో ఆ కారు ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొనడంతో రెండు వాహనాలు ధ్వంసమ య్యాయి. ప్రమాదంలో శ్రీనాథ్, చందన, వారి రెండేళ్ల కుమా రుడు, డ్రైవర్ ఒర్సు సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నార్కట్ పల్లి కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొం దుతూ చందన మృతి చెందారు. శ్రీనాథ్, చి న్నారి పరిస్థితి విషమం గా ఉన్నట్లు సమా చారం. మల్లన్న కారు డ్రైవర్ ఉప్పల నిఖిల్, పీఏ రంగయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమా దం వెనుక లారీ అతివేగమే కారణమా? మరేదైనా కుట్రకోణం ఉందా? అన్న అనుమానాల నేపథ్యం లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ పి. శ్రీశైలంను అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ లక్ష్మీ నారాయణ, డిఎస్పీ మధుసూదన్‌రెడ్డి మాట్లా డుతూ కేసు నమోదుచేసి అన్నికోణాల్లో విచారిస్తు న్నామని వెల్లడించారు. కుట్రకోణంపై ఇప్పటి వర కు ఎలాంటి నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు.

డిజిటల్ అరెస్టు మరణం కేసులో కీలక నిందితుడి అరెస్టు

హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త: నగరంలో సంచలనం రేపిన డిజి టల్ అరెస్టు మరణం కేసులో కీలక నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సదరు నిందితుడు హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాకు చెందిన సంబిత్ కుమార్ నాయక్ (24)గా గుర్తించారు. ఇతను ఒడిషాకు చె ందిన ప్రీలాన్స్ మోడల్‌గా తేలింది. టెలిగ్రాం ద్వారా చైనా సైబర్ నేరగాళ్లతో ఇతను పరిచయం పెంచుకు ని నేరాలకు పాల్పడుతున్నట్లు తేలిం ది. కాగా నాయక్ సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు, భారత్‌కు చెందిన సిం కార్డులు అందించడంతో పాటు ఓటిపిలను చేరవేస్తున్న ట్లు పోలీసులు గుర్తించారు. కాంబోడియా కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడే నేరగాళ్లకు ఇతను ఏజెంట్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తేల్చారు . బెంగళూరుకు చెందిన పోలీసులమని చెబుతూ వాట్సాప్ కాల్‌లో నగరానికి చెందిన ఓ వృద్ధురాలిని నాయక్ బెదిరించి ఆరు లక్షల 60 వేల 543 రూపాయలు కాజేయడం తెలిసిందే. గత సెప్టెంబరు నెలలో వెలుగుచూసిన ఈ ఘటనలో బాధితురాలు తీవ్రమైన ఒత్తిడి కారణంగా అ నారోగ్యం పాలై గత సెప్టెంబరు నెల ఎనిమిదవ తేదీన మరణించింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసిన పోలీసులు నగదు బదలీ అయిన ఐసిఐసిఐ బ్యాంకు ఖాతా ఆధారం గా విచారణ చేబట్టి నిందితుడి ఆచూకీ కనుగొని పట్టుకున్నారు. ఇతను గతంలోనే అనేక మందిని ఇదే విధంగా మోసం చేసినట్లు తేలింది. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద వున్న సెల్‌ఫోన్‌ను జప్తు చేసి రిమాండుకు తరలించారు.

మణిపూర్‌లో మిలిటెంట్ల కాల్పులు.. నలుగురు మృతి

ఇంఫాల్, నవంబరు 13: మణిపూర్‌లో హింస కొనసాగుతున్నది. శుక్రవారం ఇంఫాల్-ఉఖ్రుల్ రహదారిపై వెళ్తున్న రెండు మిలిటెంట్లు లక్ష్యంగా చేసుకుని 'న్యూ హేవన్న్ వద్ద మెరుపుదాడికి పాల్పడి కాల్పులు జరిపారు. ఒక వాహనంలో ప్రయాణించిన తషార్ గ్రామానికి చెందిన తల్లి, కుమారుడైన ఆగస్ట్ నగాలుంగ్, ఖాన్మిలా ఈ కాల్పుల్లో మరణించారు. అలాగే మరో వాహనంలో వెళ్తున్న షాంగ్‌షాక్ గ్రామానికి చెందిన సోదరులైన కపాంగ్‌ఖుయ్ ఆర్ఎస్, హౌలీలా ఆర్ఎస్ కూడా కాల్పుల్లో చనిపోయారు. కాగా, మణిపూర్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) నేత కె. మేఘచంద్ర ఈ కాల్పుల సంఘటనను ఖండించారు.

జ్యుయెలరీ షాపులో భారీ దోపిడీ

రూ.12 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు చోరీ

మధ్యప్రదేశ్‌లోని కట్నీలో ఘటన

భోపాల్, నవంబరు 13: మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లా కేంద్రంలో ఓ జ్యుయలరీ దుకాణంలో భారీ దోపిడీ జరిగింది. రూ.12 కోట్లకు పైగా విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలను ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో కొందరు దొంగలు కిస్సా జ్యుయలరీ షోరూమ్‌కు వెనుక గోడకు కన్నం వేశారు. లోపలికి ప్రవేశించి గ్యాస్ కట్టర్‌తో బంగారు, వజ్రాల ఆభరణాలు భద్రపరిచే సేఫ్‌లను కట్ చేసి తెరిచారు. రూ.12 కోట్లకు పైగా విలువైన బంగారం, వజ్రాల నగలను ఎత్తుకెళ్లారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ జ్యుయలరీ షాప్‌ను జూన్‌లో ప్రారంభించినట్లు యజమాని తెలిపారు. దీపావళి పండుగ నేపథ్యంలో మామూలు కన్నా ఎక్కువ ఆభరణాలను అందులో ఉంచినట్లు చెప్పారు. అయితే షోరూమ్‌లో ఉన్న ఆభరణాలన్నింటికీ బీమా ఉన్నదని నగల షాపు యజమాని వివరించారు. ఆ షోరూమ్‌లోని సిసిటివిలో రికార్డైన చోరీ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

నిజామాబాద్‌లో రోడ్డు ప్రమాదం ఇద్దరి మృతి

హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త: నిజామాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు మరణించారు. జి ల్లాలోని కంజర్ సమీపంలో గడ్డి తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కోటగల్లికి చెందిన మనోజ్ (46), రాజు (36) ప్రాణాలు కోల్పోయారు. కులాస్‌పూర్‌లో జరిగిన విందు కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వస్తుం డగా ఈ దుర్ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. వీరు వస్తున్న సమయంలో ఎదురుగా గడ్డి తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ప్రమాద తీవ్రతకు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కాగా ఈ ప్రమాద వార్త తెలియడంతో కోటగల్లిలో విషాద ఛాయ లు అలముకున్నాయి. మనోజ్‌కు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉండగా, రాజుకు భార్యతో పాటు కేవలం నెల రోజుల వయస్సున్న చిన్నారి ఉన్నాడు. కుటుంబాలకు అం డగా ఉన్న ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకతల్లో

హౌసింగ్ కార్పొరేషన్‌కు ప్రతిష్టాత్మక ఐఎస్ఓ సర్టిఫికెట్లు

అవినీతిరహిత పాలన దిశగా కీలక ముందడుగు

హైదరాబాద్,నవంబరు13,ప్రభాతవార్త: పారదర్శకంగా జవాబుదారీ తనంతో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరుస్తూ, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నందుకు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు ప్రతిష్టాత్మకమైన ఐఎస్ఓ సర్టిఫికేట్లు లభించాయి.ఈ సర్టిఫికేట్లను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి‌పి గౌతం అందుకున్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి వసతిని కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలులో వివిధ అంశాలపై అధ్యయనం చేసిన ఐఎస్ ఓ ప్రతినిధుల బృందం ఈ మేరకు సర్టిఫికేట్లను అందచేసింది. పాలనా పరమైన అంశాల్లో నాణ్యతా ప్రమాణాల వ్యవస్థ పటిష్టంగా అమలు చేస్తున్నందుకు ఐఎస్ఓ 9001:2015 (నాణ్యతా నిర్వహణ వ్యవస్థ) సర్టిఫికేట్‌తో పాటు, అవినీతికి తావులేకుండా సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్నిపెంపొందించే చర్యలకు గాను ఐఎస్ఓ 37001:2016 (అవినీతి నిరోధక నిర్వహణ వ్యవస్థ) సర్టిఫికేట్లను లభించాయి. అలాగే ఐటీ సర్వీసుల్లో అత్యున్నతమైన భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నందుకు ఐఎస్ఓ 27001 (సమాచార భద్రతా నిర్వహణ వ్యవస్థ), వినియోగదారుల సంతృప్తి మరియు ఫిర్యాదుల పరిష్కార నిర్వహణ వ్యవస్థ నిర్వహణకు ఐఎస్ఓ 10002 సర్టిఫికేట్లను ఐఎస్ఓ సంస్థ జారీ చేసింది.

అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10కోట్లు విరాళం



తిరుమల,నవంబర్ 13ప్రభాతవార్తప్రతి నిధి: గోవింద నామస్మరణతో తిరు మలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అందించే అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు తమ వంతు విరాళాలందిస్తున్నారు. శుక్ర వారం ఉదయం ఓ దాత భూరి విరాళం అందజేశారు. తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన శ్రీవారి భక్తుడు కొడాలి శ్రీకాంత్ కుటుం బంతో కలసి వేంక టేశ్వర అన్న ప్రసాదం ట్రస్ట్‌కు 10 కోట్ల రూపా యలు భారీ మొత్తాన్ని విరాళంగా సమర్పించారు.రంగనాయకుల మండపంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరిని కలసి చెక్కు అందజేశారు. భారీ విరాళం అందించిన దాతను టిటిడి అదనపు ఇఒ చౌదరి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ పాల్గొన్నారు. తిరుమలకు వచ్చే లక్షలాదిమంది భక్తుల ఆకలి తీర్చే అన్నప్రసాదం ట్రస్టుకు ఇంతటి భారీ విరాళాన్ని అందించినందుకు దాత శ్రీకాంత్‌ను వెంకయ్య చౌదరి ప్రత్యే కంగా అభినందించారు. అనంతరం దాతకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగేందుకు వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు ఎంతో కీలకపాత్ర పోషిస్తోంది. భక్తుల నుండి వచ్చే ఇటువంటి ఉదార విరాళాల ద్వారానే రోజువారీగా లక్షలాది మందికి అన్నప్రసాద వితరణ సాధ్యమవుతోందని అధికారులు పేర్కొన్నారు.

కొండపై కొనసాగుతున్న భక్తుల రద్దీ దర్శనానికి 18గంటలు



తిరుమల,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి: పవిత్రకార్తీకమాసంలో వాకాంతం రావడంతో ఏడుకొండల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి దర్శనానికి భక్తులు సంఖ్య విపరీతంగా వున్నారు. వారాంతం వరుసగా రెండవ శనివారం,ఆదివారం సెలవులు రావడంతో శుక్రవారం కూడా తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. శునకవారం ఉదయం 5గంటలకే వైకుంఠం 2లో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు వెలుపల లైన్లు వ్యాపించాయి. స్వామివారి సర్వదర్శనానికి 18గంటలు సమయం నిరీక్షణ తప్పడంలేదు. సాయంత్రం వరకు 50వేలమంది మహాలఘులో దర్శనం చేసుకున్నారు. ఈ రద్దీ మరోరెండురోజులు విపరీతంగా పెరగనుంది.

నాగులచవితి పర్వదినాన పెద్దశేషునిపై పురుషోత్తముడు

తిరుమల,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి: సత్యయుగంలో వైకుంఠంలో శ్రీమహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీకృష్ణునిగా కలియుగంలో శ్రీవేంకటే శ్వరస్వామిగా పూజలందు కుంటున్న మలయప్పస్వామి శుక్రవారం రాత్రి పెద్దశేషవా హనంపై భక్తులకు దర్శనమి చ్చాడు. దీపావళి ఆస్థానం ముగిసిన నాల్గవరోజు శుక్రవారం నాగులచవితి పర్వదినం కావడంతో సాయంత్రం మలయప్పస్వామిశ్రీదేవిభూదేవి ఉభయదేవేరులతో కలసి ఏడుతలల పెద్దశేషునిపై భక్తులకు అభయమిచ్చాడు. రాత్రి 7గంటలకు వాహనమండపంపద్ద పెద్దశేషవాహనంపై వేంచేపుచేసిన మలయప్పస్వామి ప్రత్యేక పూజలందుకుని అక్కడ నుండి మాధవీధుల్లో ఊరేగుతూ భక్తులను బ్రోచాడు. స్వామివారివాహనసేవ అత్యంత రమణీయంగా జరిగింది. ఈ వాహనసేవలో టిటిడి పెద్దజీయర్,చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ బయ్యాల భాస్కర్, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు పాల్గొన్నారు.



రేపటితో ముగియనున్న మ్యూజియం ట్రయల్ రన్

16 నుండి భక్తులకు అనుమతి

తిరుమల,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో నూతనంగా ఆధునీకరించిన వేంకటేశ్వర మ్యూజియం సందర్శనకు నిర్వహిస్తున్న ట్రయల్ రన్‌ను రేపటి వరకు పొడిగించిన విషయం తెలిసిందే. ఈ ట్రయల్ రన్‌కు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉన్న నేప థ్యంలో నేడు,రేపు అవకాశాన్ని సద్వి నియోగం చేసు కో వా ల్సి ం ది గా టిటిడి కోరుతోంది.



టిటిడి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, తిరుమల, తిరుపతిలో పనిచేసే మీడియా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, టిటిడి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, శ్రీవారి సేవకులను ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మ్యూజియం సందర్శనకు ఉచితంగా అనుమతించడం జరుగుతుంది. ట్రయల్ రన్ పూర్తయిన అనంతరం నవంబర్ 16వ తేదీ నుండి భక్తులను మ్యూజియం సందర్శనకు అనుమతించడం జరుగుతుంది. మ్యూజియం ప్రవేశ రుసుమును 50 రూపాయలుగా నిర్ణయించారు.

తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కౌన్సిల్ : భూపాలపల్లి

సంక్షిప్త టెండర్ ప్రకటన నెం. E1/CT.No:16/MCBHPL/ఇ-ప్రొక్యూర్‌మెంట్/2026, తేదీ: 13.11.2026

కమిషనర్‌గారి ఆదేశాల మేరకు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్ విధానం ద్వారా వివిధ పనులకు టెండర్ పిలవటానికి ప్రతిపాదించడమైనది. వివిధ గ్రాంట్‌తో వివిధ పనులు. ఆన్‌లైన్ బిడ్స్ దాఖలుకు చివరి తేదీ/సమయం: 23.11.2026 సా.4.00గం. వరకు. బిడ్స్ కొరకు తెరచు తేదీ: 23.11.2026 సా.5.00గం. వద్ద. సంబంధిత కమిషనర్ పేరు మరియు చిరునామా: శ్రీ కె. ఉదయ్‌కుమార్, కమిషనర్, మునిసిపల్ కౌన్సిల్, భూపాలపల్లి ఫోన్ నం: 8978180029. తదుపరి వివరాలు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. పని యొక్క డౌన్‌లోడింగ్ 16.11.2026న సా.05.00గం. ఆపై నుండి I & PR విభాగం ద్వారా ప్రారంభించబడును.

నం/-. మునిసిపల్ కమిషనర్, భూపాలపల్లి.

DIPR.NO. 13663-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 13.11.2026

సిద్దిపేట గడ్డపై టిఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

హరీశ్‌ను ప్రజాజీవితం నుంచి తరిమేస్తాం: పార్టీ చీఫ్ కవిత



మీడియాతో మాట్లాడుతున్న టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: అవినీతిపరుడు హరీశ్‌రావును ప్రజా జీవితం నుంచి తరిమేసే వరకు తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని.. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తూ రాబోయే శాసనసభ సాధారణ ఎన్నికల్లో రాజ కీయంగా సిద్దిపేట గడ్డపై టిఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి చౌరస్తా సమీపంలో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి భర్త అనిల్‌రావు, పార్టీ శ్రేణులతో కలిసి భూమి పూజ చేసిన అనంతరం శుక్రవారం ఏర్పాట

వార్త

చదువు డబ్బులాంటిది. ఎంత సంపాదించినా అంతకంటే ఎక్కువ సంపాదించడానికి మనస్సు ఉబలాటపడాలి.

న- జోసఫ్ బిల్లింగ్స్

ఇంటర్ విద్యకు చరమగీతం!

జాతీయ విద్యా విధానం మరోసారి కొత్తరూపు దిద్దుకోబోతుంది. కొత్త విద్యావిధానంలో నర్సరీనుంచి 4వరకు ప్రాథమిక విద్య కాగా 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ విద్య, ఆ తర్వాత 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా రూపాంతరం చెందుతోంది. ఇదంతా కేంద్ర ప్రభుత్వమే ప్రతిపాదించినప్పటికి కొన్ని రాష్ట్రాలలో సెకండరీ విద్య, ఇంటర్మీడియేట్ విద్య కలిసి ఉండగా, మరికొన్ని రాష్ట్రాలలో అవి వేర్వేరు నిర్వాహక వ్యవస్థల ద్వారా నడుస్తున్నాయి. దీని మీద ఎక్కడా పెద్ద ఎత్తున చర్చలు జరిపిన దాఖలాలు లేవు. నూతన విద్యావిధానం నిర్ణయించినప్పుడలా మారుతున్న దేశ కాల మాన పరిస్థితుల రీత్యా విధి విధానాలను స్థిరీకరిస్తారు. కానీ పదేపదే విద్యావిధానాలు అటూ ఇటూ మార్చే నిర్ణయాలు విద్యార్థుల్లో గందరగోళం సృష్టిస్తాయి. 55 ఏళ్లనాడు 1969- 70లో అప్పటి విద్యాశాఖ మంత్రి పి.వి నరసింహారావు ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఇంటర్మీడియేట్ విద్యావిధానానికి మంగళం పాడటమే కొత్త విద్యావిధాన లక్ష్యంగా కనపడుతోంది. 2027-28 విద్యాసంవత్సరం నుంచి 11, 12 తరగతులను (+2 విధానం) నేరుగా పాఠశాల విద్యలో విలీనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సిబిఎస్ఇతోపాటు దేశంలో మెజారిటీ రాష్ట్రాలు అనుసరిస్తున్న విద్యావిధానానికి అనుగుణంగా ఈసారి కొత్త మార్పులు జరుగబోతున్నాయి. ఆ మేరకు రాష్ట్ర విద్యావిధానాన్ని మార్చాల్సిందేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. దీనిపై ఆయన విద్యాశాఖాధికారులతో సమీక్షించి తాజా నిర్ణయాన్ని ప్రకటించారు. దేశంలో 18 రాష్ట్రాలలో, 10+2 విద్యావిధానం అమల్లో ఉన్నందున, తెలంగాణలో కూడా విద్యార్థుల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు ముకుతాడు వేయగల ఈ విద్యావిధానంపై తన మీద ఎన్నోఒత్తిడిలు ఉన్నట్లు ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. తెలంగాణలో పదో తరగతి తర్వాత దాదాపు 40 శాతం మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నట్లు ప్రభుత్వ గణాంకాలు తేల్చాయి. పదో తరగతి తరువాత కాలేజీ చదువులకోసం గ్రామాల నుంచి పట్నాలకు పై చదువుల పేరిట వెళ్లే క్రమంలో పేద గ్రామీణ బాలికల విద్య పదో తరగతికే పరిమితమైపోతోంది. ఇలా డ్రాపౌట్లు పెరిగిపోతున్నాయి. నవోదయ, కెజిబివిలో 12వ తరగతి వరకు ఒకే చోట ఉన్న కారణంగా ఆయా ప్రాంతాల్లో డ్రాపౌట్లు బహు తక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇంటర్మీడియేట్ విద్యను సీనియర్ సెకండరీ విద్యగా మార్చి పాఠశాల విద్యావిధానంలో విలీనం చేయడం మంచిదని కేంద్ర ప్రభుత్వం ఏనాడో విద్యా ప్రణాళికలు మార్చింది. నిజానికి ఒకే చోట సమగ్రవిద్యా తరగతులు ఉండకపోవడం, ఆర్థిక భారం మోయలేక వెనక్కి తగ్గుతున్నవారిలో ప్రధానంగా బాలికలు, దళితులు, గిరిజన, మైనారిటీ వర్గాల వారే ఉంటున్నారు. కొత్త విధానంతో డ్రాపౌట్లు తగ్గుతాయి. డ్రాపౌట్లను అరికట్టడంలో విద్యార్థుల్లో భాషా, సమాచార నైపుణ్యాలు పెంచడమే లక్ష్యంగా కొత్త విధానాన్ని రూపుదిద్దారు. ఇలా బోర్డులను ఏకీకృతం చేయడంవల్ల కేంద్ర ప్రభుత్వ నిధుల సమీకరణ సులభతరం అవుతుంది. పాఠశాల, కళాశాలల మౌలిక సౌకర్యాలను ఉమ్మడిగా వాడుకోవచ్చునన్నది ప్రభుత్వం అంచనా. తెలంగాణ వరకు చూస్తే ఏడాదికి సగటున ఒక్కో విద్యార్థిపై రూ. 1.08 లక్షలు ఖర్చవుతుండగా ఈ విలీనం తర్వాత తలసరి వ్యయం రూ. 60 వేలకు తగ్గుతుంది. ఇదిలా ఉంటే పాఠశాల విద్యలో ఇంటర్ విద్య విలీనంపై ఇంటర్ ప్రభుత్వ లెక్చరర్ల సంఘాల జెఏసి ఆగ్రహం వెలిబుచ్చింది. ఇంటర్ విద్య ప్రత్యేకంగా ఉన్నందునే విద్యార్థులు జెఇఇ, నీట్ లాంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ శ్రేణుల్లో ఉంటున్నందున, ప్రస్తుత విధానమే మేలంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని వారు కోరుతున్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఒకే గొడుగు కిందకు రావడంతో ప్రతి ఒక్కరి విద్యా నైపుణ్య సామర్థ్యాలను ఉపాధ్యాయులు వ్యక్తిగతంగాశ్రద్ధ తీసుకునే అవకాశం ఉంటుంది. విద్యావ్యవస్థలో ఇలాంటి ప్రధాన నిర్ణయం తీసుకుంటే ముందస్తు అధ్యయనం చేయకపోవడం లోపభూయిష్టంగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. స్థూలంగా ఇకపై జూనియర్ కళాశాల ఏర్పాటు ఉండబోదు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కనీస వసతులు, సైన్స్ ప్రయోగశాలల లేమి కనపడుతోంది. ఇంటర్ బోర్డును రద్దు చేస్తే తమ జూనియర్ లెక్చరర్ల పోదా తగ్గిపోతుందనే ఆందోళన ఉపాధ్యాయుల్లో ఉంది. ఇంటర్ బోర్డు విలీన ప్రక్రియలో క్యేడర్ విలీనంపై స్పష్టమైన విధివిధానాలు రూపొందకపోవడంతో అధ్యాపకుల ఆందోళన నడుస్తోంది. ఇంటర్ బోర్డు రద్దు చేయాలంటే దానికి ఓ పెద్ద తతంగం చట్టసవరణ అవసరం ఉంటుంది. కార్పొరేట్ కళాశాలల ఒత్తిడి, మార్కుల వేట వంటి ఇంటర్ విద్యలో నడుస్తున్న రుగ్మతలన్నీ పాఠశాల విద్యలోకి మార్చినా పోయేటట్లు కన్పించడం లేదు. ప్రభుత్వ పాఠశాలలపై 11, 12 తరగతుల భారం పడితే ప్రభుత్వ విద్య బలహీనపడుతుంది. ప్రయివేటు విద్యకు సకల సౌకర్యాలు ఉండడంతో వాటివైపే విద్యార్థులు మొగ్గు చూపే అవకాశం లేకపోలేదు.సరైన అధ్యయనం, విస్తృత చర్చ పర్యావసనాలు గుర్తించాలి.విలీన ప్రక్రియ పకడ్బందీగా జరగకపోతే పాఠశాల విద్య చిన్నబోతుంది.

మాటలతో 'మత్తు'ను మట్టుపెట్టలేం

ఆరోపణలకు గురవుతున్నవారిలో కొందరు ప్రముఖులో, లేక వారి సుపుత్రులో ఉండడం కూడా కేసులు ముందుకు నడవడం లేదనే ఆరోపణలున్నాయి. గతంలో ఆనాటి పోలీసు కమిషనర్ ఏకంగా విలేకర్ల సమావేశం పెట్టి డ్రగ్స్ రవాణా, వినియోగంలో పట్టుబడితే వారు ఎంతటి పెద్దవారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రకటించారు. ఆనాడు చాలా మంది రాజకీయ నాయకులు పుత్రరత్నాల పేర్లు, వారి సన్నిహితుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తర్వాత ఆ కేసు ఏమైందో తెలియదు. మళ్లీ ఒకసారి ఎక్సైజ్ అధికారుల దాడుల్లో అనేక విషయాలు బయటపడ్డాయి. కొందరు ప్రముఖులను పిలిపించి విచారణ చేశారు. విచారణ సమయంలో చేసిన హడావుడి ప్రచారం అంతా ఇంతా కాదు. ఈ కేసుల్లో కూడా ఎవరిపై చర్యలు తీసుకున్నారు? ఏమైందో? వెలుగు చూడలేదనే చెప్పొచ్చు. ఇలాంటి సంఘటనలతో చట్టాలన్నా, అధికారులన్నా ఈ మత్తు వ్యాపారులకు భయభక్తులు లేకుండాపోయాయి.

దామెర్ల సాయిబాబు

మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారి తీస్తుందని, దాన్ని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతోకాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు దశాబ్దాలుగా చెప్తూనే ఉన్నారు. నియంత్రించేందుకు చట్టాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలో పోలీసు నిఘా విభాగాల ఉన్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ భారత్‌ను డ్రగ్స్‌రహిత దేశంగా మార్చేందుకు ప్రయత్నం ఆరంభించినట్లు ప్రకటించారు. నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు పోతూ భారతదేశంలోకి డ్రగ్స్ రాకుండా, అలాగే దేశం నుంచి బయటకు పోకుండా కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ప్రకటించారు. 2029 డిసెంబరు 31 నాటికి భారతదేశంలో మాదకద్రవ్యాలను పారద్రోలే లక్ష్యంగా నిర్ణయించి అడుగులు వేస్తున్నట్లు ఆయన వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ రక్కసిని అంతమొందించేందుకు అటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. అందుకోసం ప్రత్యేక విభాగాలనే ఏర్పాటు చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులు ఈ మాదకద్రవ్యాలను మట్టుబెట్టేందుకు తమవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఈ డ్రగ్స్ వ్యాపారులు రకరకాల వ్యూహాలతో ఒక పక్కా ప్రణాళికతో విస్తరిస్తున్నారు. ఫలితంగా వినియోగం ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. ముఖ్యంగా ఈవ్యసనం ఇరవై యేళ్లలోపు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మాదక ద్రవ్యాల మత్తులో వారు ఏం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకునేందుకు హత్యలుచేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డార్క్‌నెట్ ద్వారా జరిగిన మత్తుమందుల కొనుగోళ్లలో ఆసియా ఖండంవాటాపదిహేను శాతంపైగా పెరిగిపోయింది. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం. రెండు దశాబ్దాలక్రితం భారత్‌లో కోటిడెబ్భై లక్షల మందికిపైగా మత్తుమందు వాడకందారులుంటే ప్రస్తుతం పదహారు కోట్లకుపైగా చేరి ఉండవచ్చునని అంచనా. మత్తుమందుల వాడకంలో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నట్లో అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో యేటా పది, పదిహేనువేల కోట్ల రూపాయలు విలువైన మత్తుమందులపై ఖర్చుపెడుతున్నట్లు అంచనా. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి రానురాను ఆందోళనకరంగా మారుతున్నది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉన్నాయి. ఈ రవాణాలో పట్టభద్రులైన యువకులుకూడా పాలపంచుకుంటున్నారు. ఎన్నోసార్లు పట్టుబడుతున్నారు. కొన్నిసందర్భాల్లో జైలుకువెళ్లివచ్చి మళ్లీ అదే బాటలో పయనిస్తున్నారు. ఈ యేడాది దాదాపు లక్షకుపైగా కేసులు నమోదుకాగా ఇరవైఐదువేల కోట్ల రూపాయల విలువైన మత్తుమందులను స్వాధీనం చేసుకొని లక్షా ఇరవైవేల మంది నిపైగా అరెస్టుచేశారు. పట్టుబడుతున్నది వినియోగం,రవాణా అవుతున్నదాంట్లో అతికొద్ది శాతమేననే విషయాన్ని అధికారులు కూడా అంగీకరిస్తున్నారు.దీనికితోడు గంజాయి సాగు ఊహించనిరీతిలో పెరిగిపోయింది.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, విశాఖఏజెన్సీలోనూ,తెలంగాణలో ఖమ్మం, వరంగల్, తదితర జిల్లాల్లో అటవీ ప్రాంతంలో గంజాయి సాగు బాగా విస్తరిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయి. ఇక విదేశాల నుండి భారీఎత్తున డ్రగ్స్ ఇటు తెలంగాణకు, అటు ఆంధ్రప్రదేశ్‌కు చేరుకుంటున్నట్లు సమాచారం.ఇందుకు పట్టుబడుతున్న సంఘటనలు బలం చేకూరుస్తున్నాయి. గతంలో

ఒక్క మాట

గుజరాత్‌లోని ముంద్రాపోర్టులో ఇరవైఒక్కవేలకోట్ల రూపాయల విలువైన మూడువేల కిలోల హెరాయిన్ పట్టుబడినట్లు విజయవాడ లింక్ వెలుగులోకి వచ్చాయి. మత్తుమందుల సరఫరా కోట్లడాలర్ల వ్యాపారంలో ఎక్కువభాగం ఉగ్రవాద సంస్థలకు చేరుకుంటున్నట్లు దర్యాప్తుసంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తోపాటుమరికొన్ని ఆఫ్రికాదేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కాశ్మీర్ ఉగ్రవాదులకు పంజాబ్ మత్తుమందుల సరఫరాదారులకు గట్టి సంబంధాలే ఉన్నట్లు చెబుతున్నారు. మత్తు ముఠాలు సొంతంగా పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకునే స్థాయికి ఎదిగాయి.మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పర్చుకున్నారు. లాటిన్ అమెరికాలో తయారవుతున్న మందులు ప్రపంచ నలుమూలలకు విస్తరించడంతోపాటు రసాయనికాలతో తయారుచేసే 'యాంఫెటామైన్, టైప్‌స్టిమ్ లెన్స్'ఎక్కడికక్కడ తయారవుతున్నాయి. భారతదేశంలో ఈ తరహా మత్తుమందులు ఉత్పత్తి అవుతున్నాయి. అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఈ మత్తువ్యాపారులు ఉపయోగించుకుంటున్నారు. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాలోకి బదలీచేయించే 'క్రిప్టోకరెన్సీ'వాడకం సైతం పెరిగిపోవడంతో లావాదేవీలకు అడుపులేకుండాపోతున్నది. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసినా, వాడకందారులు నమ్మకం ఉన్నవారినే సంప్రదించేవారు. మత్తుమందును తీసుకొని డబ్బులు చేతిలో పెట్టేవారు. ఆ వ్యాపారం కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తు మందుతెప్పించి అప్పగించేవారు. అయితే అత్యంత పకడ్బందీగా జరుగుతున్నా నిఘావిభాగం అధికారులు కన్నువేయడంతో ఎక్కడోదగ్గర దొరికిపోయేది. మత్తుమందు రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇలా ఈ మహమ్మారి ప్రపంచమంతా విస్తరించిపోయింది. మెక్సికో కేంద్రంగా రకరకాల మార్గాల్లో అన్నిదేశాల్లో ప్రవేశిస్తున్నది. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు రెండువేల టన్నులకుపైగా ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్న ట్లు అనధికార అంచనాలను బట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా హైదరాబాద్‌లో పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. పట్టుబడుతున్న కేసుల్లో కూడా పటిష్టంగా వ్యవహరించలేకపోవడం వల్లనోలేక చట్టాల్లో ఉన్న లొసుగులతోనో బయటకు వచ్చితిరిగి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. అసలు పట్టుబడుతున్న కేసుల్లో సమర్థవంతంగా దర్యాప్తు జరిపి న్యాయస్థానం ముందుతిరుగులేని సాక్ష్యాలతో నిందితులను నిలబెట్టడంలో అధికారులు విఫలమవుతుండడం వల్లనే అధిక శాతం కేసులు వీగిపోతు న్నాయనే ఆరోపణలను కొట్టివేయలేం. ఈ ఆరోపణలకు గురవుతున్న వారిలో కొందరు ప్రముఖులో,లేక వారిసుపుత్రులో ఉండడం కూడా కేసులు ముందుకు నడవడం లేదనే ఆరోపణలున్నాయి. గతంలో ఆనాటి పోలీసు కమిషనర్ ఏకంగా విలేకర్ల సమావేశం పెట్టి డ్రగ్స్ రవాణా, వినియోగంలో పట్టుబడితే వారు ఎంతటి పెద్దవారినైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదని ప్రకటించారు. ఆనాడు చాలా మంది రాజకీయ నాయకులు పుత్రరత్నాల పేర్లు, వారి సన్నిహితుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తర్వాత ఆ కేసు ఏమైందో తెలియదు. మళ్లీ ఒకసారి ఎక్సైజ్ అధికారుల దాడుల్లో అనేక విషయాలు బయటపడ్డాయి. కొందరు ప్రముఖులను పిలిపించి విచారణ చేశారు. విచారణ సమయంలో చేసిన హడావుడి ప్రచారం అంతా ఇంతా కాదు. ఈ కేసుల్లో కూడా ఎవరిపై చర్యలు తీసుకున్నారు? ఏమైందో? వెలుగు చూడలేదనే చెప్పొచ్చు. ఇలాంటి సంఘటనలతో చట్టాలన్నా, అధికారులన్నా ఈ మత్తు వ్యాపారులకు భయభక్తులు లేకుండాపోయాయి. మొత్తం మీద ఈ మాదకద్రవ్యాల విషవలయంలో బలైపోతున్నది యువతీయువకులే.ఎనిమిది,తొమ్మిదో తరగతిచదువుతున్న బాలబాలికలను ఒక వ్యూహం ప్రకారం ఎరవేసి ఈ మత్తులోకి దించుతున్నారు. ఈ మధ్య ఒకరింట్లో గంజాయి మొక్కలు పెంచుతున్న విషయాన్ని పోలీసులు పసికట్టినట్లు భోగట్టా. మానవ జీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది. అంతేకాదు వీటిని నిరోధించే విషయంలో బాధ్యతంతా పాలకులపై వదిలిపెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ పార్టీలు అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన తరుణమిది.

సహకార స్ఫూర్తికి రక్షణ కవచంగా ఎంఎసిఎస్ చట్టం!

లగడపాటి వెంకటేశ్వరరావు

ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడిపోయినా, దొడ్డిదారిన అధికారాన్ని చేజిక్కించుకునే రాజకీయ ఎత్తుగడలు ఇప్పుడు సహకార రంగాన్ని సైతం కలుషితం చేస్తున్నాయి. మహారాష్ట్రలోని ప్రఖ్యాత 'గోకుల్ డెయిరీ' పాలకవర్గ ఎన్నికల్లో తాజాగా చోటుచేసుకున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. ఈ తరుణంలో, మూడు దశాబ్దాల క్రితమే ఇలాంటి అధికార దుర్వినియోగాన్ని ఊహించి, సహకార సంఘాలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించిన మహనీయులు ఎన్.టి. రామారావు దార్శనికత, ప్రజాస్వామ్యంపై ఆయనకు గల అపారమైన గౌరవం మరోసారి చర్చనీయాంశమైంది.గోకుల్ డెయిరీలోని 25 డైరెక్టర్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి 13, అధికార కూటమి 12 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే, ఛైర్మన్ ఎన్నికకు 14 మంది కోరం అవసరమనే నిబంధనను అడ్డుపెట్టుకుని అధికార పక్షం సభను బహిష్కరించింది. అనంతరం మహారాష్ట్ర ప్రభుత్వం హుటాహుటిన ఆర్డినెన్స్ తెచ్చి, సహకార చట్టాన్ని సవరించింది. ప్రభుత్వ నామినేటెడ్ డైరెక్టర్లలో నలుగురికి ఓటు హక్కు కల్పించడం ద్వారా 12గా ఉన్న తమ బలాన్ని 16కు పెంచుకుని, ప్రజా తీర్పుకు విరుద్ధంగా డెయిరీని హస్తగతం చేసుకుంది. ఉమ్మడి ఏపీలోని 1964 సహకార చట్టం కూడా మహారాష్ట్ర చట్టం తరహాలోనే ఉండేది. సంఘాల్లో ప్రభుత్వ వాటా ఉండటం వల్ల



నామినేటెడ్ డైరెక్టర్లను నియమించడం, పాలకవర్గాలను రద్దు చేసి అధికారులను నియమించడం వంటి పెత్తనం నడిచేది. ఈ రాజకీయ క్రీడలకు స్వస్తి పలుకుతూ ఎన్టీఆర్ 1995లో 'పరస్పర సహాయక సహకార సంఘాల చట్టం' తెచ్చారు. దీని కింద ఏర్పడే సంఘాల్లో ప్రభుత్వానికి ఒక్క రూపాయి వాటా కూడా ఉండదు. ఫలితంగా బోర్డులో ప్రభుత్వ నామినీలను నియమించే, పాలకవర్గాన్ని రద్దు చేసే అధికారం సర్కారుకు పూర్తిగా రద్దయింది.1995చట్టం కల్పించిన స్వేచ్ఛవల్లే సంగం, కృష్ణా,విశాఖ, ముల్క నూర్ వంటి డెయిరీలు దేశానికే ఆదర్శంగా ఎదిగాయి. ఆతర్వాతి ప్రభుత్వాలు ఈ స్వేచ్ఛకు కళ్లెం వేసే ప్రయత్నం చేసినా న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. 2006లో నాటిరాజశేఖర రెడ్డి ప్రభుత్వం డెయిరీలను తిరిగి 1964చట్టంలోకి తెచ్చేందుకు చేసిన సవరణను హైకోర్టు కొట్టివేసింది. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని ఏపీ ప్రభుత్వం 2021-22 మధ్యకాలంలో సంగం డెయిరీ వంటి సంస్థలను తిరిగి 1964 చట్టపరిధిలోకి తేవడానికి లేదా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడానికి ఎంఎసిఎస్ చట్టానికితలపెట్టిన సవరణ ప్రయత్నాలపై హైకోర్టు స్టేవిధించింది. ఎంఎసిఎస్ చట్టంకింద ఉన్న సంస్థల అంతర్గత వ్యవహారాల్లో ప్రభుత్వ అధికారుల జోక్యాన్ని కోర్టులు ఎంతమాత్రం అంగీకరించ లేదు.గోకుల్ డెయిరీ ఉదంతం పాత చట్టాల్లోని ప్రమాదకర పోకడలను బట్టబయలు చేసింది.సహకార రంగాన్ని రాజకీయ క్రీడలకు దూరంగా ఉంచాలంటే,ఎన్టీఆర్ తెచ్చిన 1995 చట్టంస్ఫూర్తిని దేశవ్యాప్తంగా అమలు చేయడమే ఏకైక పరిష్కారం.

బాల్యం తిరిగిరాని నిధి, సంరక్షించడం మన విధి



మేకిరి దామోదర్

బాల్యం అంటే..అది కేవలం వయసులోని ఒక దశ కాదు. అది మనిషి జీవితానికి పునాది వేసే కాలం. ఒక విత్తనం మహావృక్షంగా ఎదగాలంటే దానికి తగిన నేల,నీరు, వెలుతురు ఎంత అవసరమో, ఒక బిడ్డ సంపూర్ణ మానవుడిగా ఎదగాలంటే ప్రేమ, పోషణ, విద్య, విలువలు అంతే అవసరం. కానీ నేడు మనం బాల్యాన్ని ఒక పోటీ పరుగుగా మార్చేశాం. మార్కుల కోసం, ర్యాంకుల కోసం, భవిష్యత్తు కోసం అంటూ ఆ చిన్నారి నవ్వులను, ఆటలను, అమాయకత్వాన్ని బలి చేస్తున్నాం. ఒకసారి జారిపోయిన బాల్యం మళ్లీ తిరిగి రాదు. అందుకే బాలల దినోత్సవం కేవలం వేడుక కాదు, మన బాధ్యతను గుర్తుచేసే హెచ్చరిక. మన దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1889 నవంబర్ 14న జన్మించారు. స్వాతంత్ర్య పోరాట యోధుడిగా, ప్రముఖ న్యాయవాదిగా, రచయితగా ఆయన చరిత్రలో నిలిచారు. పంచవర్ష ప్రణాళికలతో, మిశ్రమ ఆర్థిక విధానంతో, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్తు, జలవినియోగంలో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారు. ఆలీన విధాన రూపకర్తగా, పంచశీల సూత్రాలతో ప్రపంచ శాంతిని కాంక్షించారు. అయితే నెహ్రూను ప్రజలు 'చాచా నెహ్రూ' అని ప్రేమగా పిలిచేవారు. ఎందుకంటే బాలల పట్ల ఆయనకు అపారమైన ప్రేమ ఉండేది. తన కోటుకు గులాబీని అలంకరించుకునే వారు. బాలలు అప్పుడే వికసించిన గులాబీలని అభివర్ణించే వారు. ఎక్కడికి వెళ్లినా బాలల మధ్యనే గడిపేవారు. ఆ క్షణాలే తన జీవితంలో మధురమైనవని రచనల్లో పొందుపరిచారు. బాలల కోసం అనేక పథకాలు అమలు చేశారు. ఈ దేశానికి బాలలు 'తరగని ఆస్తి' అని చెప్పేవారు. 1964 లో ఆయన మరణం తర్వాత ఆయన పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇది కేవలం జయంతి వేడుక కాదు, బాలల హక్కుల పరిరక్షణకు మనం చేసిన ప్రతిజ్ఞ. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ సరైన ఆహారం లేక పిల్లలు నీరసపడిపోవడం మనందరినీ సిగ్గుపడేలా చేస్తున్న విషయం. పోషకాహార లోపంవల్ల ఆర్థికంగా,సామాజికంగా జరిగే నష్టం అంతా ఇంతా కాదు. దేశ పురోగతే ప్రమాదంలో పడుతుంది. ప్రభుత్వాలు దశాబ్దాలుగా అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు,బాలింతలు,చిన్నారులకు సమతుల ఆహారం అందిస్తున్నాయి. బడుల్లో పౌష్టికాహారం సమకూరుస్తున్నాయి. దీనివల్ల పోషణ స్థాయిలో కొంత మెరుగుదల వచ్చింది.ఇది అభినందనీయమే. కానీ 2023-24 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేచెబుతున్న నిజం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.ఐదేళ్లలోపు చిన్నారుల్లో 29శాతం మంది వయసుకు తగినట్లుగా ఎదగలేదు. 32శాతం మంది బాలలు బరువు తక్కువగా ఉన్నారు. 6 నుంచి 23 నెలల పిల్లల్లో 85



శాతం మందికి తగినంత పోషకాహారం అందడం లేదు. ఐదేళ్లలోపు చిన్నారుల అకాల మరణాల్లో 69 శాతానికి పోషకాహార లోపమే కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. పోషకాహార లోపంతో పెరిగిన బాలికలు తర్వాత తక్కువ బరువుతో కూడిన పిల్లలకు జన్మనిచ్చే ముప్పు ఎక్కువ. ఇలా ఈ సమస్య ఒకతరం నుంచి మరో తరానికి పాకుతూ దేశాన్ని అంధకారంలోకి నెడుతోంది. ఇది నిశ్శబ్ద విపత్తు. 30 శాతానికి పైగా చిన్నారులకు అన్నం, పప్పు, రొట్టెలు తప్ప వైవిధ్యభరితమైన, పోషకాలు కలిగినఆహారం అందకపోవడంతో రక్తహీనత రాజ్యమేలుతోంది. ప్రభుత్వాలు దీన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు. పౌష్టికాహారంలో లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి చక్కదిద్దాలి. ఈ ఆధునిక కాలంలో మానవ విలువలు తగ్గిపోతున్నాయి. అందుకే బాల్యానుంచే తన కోసంకాదు, పరులకోసం బతకాలి,తాను ఉన్నా లేకున్నా తన పేరు నిలవాలి అనే భావనను పిల్లల్లో నాటాలి. చదువుకన్నా విలువలు ముఖ్యమని తెలియజెప్పాలి. మంచితనం, క్యారెక్టర్, బాధ్యత, మానవత్వం వంటి అంశాలను కోర్సుల ద్వారా కాకుండా ఆచరణ ద్వారా నేర్పాలి. నిస్వార్థజీవనంలోని మాధుర్యాన్ని రుచి చూపించాలి. అప్పుడే విద్య సంపూర్ణ వెలుగును ప్రసరింపజేస్తుంది. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడేటప్పుడు ఇది చాలాఎక్కువ ధర, మనకు స్తోమత లేదు, డబ్బు సంపాదించడం కష్టం వంటి మాటలు అనకూడదు. దానికి బదులుగా ప్రస్తుతం అది మన బడ్జెట్‌లో లేదు. డబ్బును సరిగాప్లాన్ చేసి దాన్ని ఎలా సాధించవచ్చో ఆలోచిద్దాం అని చెప్పాలి. మనం వాడే ఈచిన్న మాటలే భవిష్యత్తులో వారి ఆర్థిక అలవాట్లను నిర్ణయిస్తాయి. విద్యార్థుల్లో వాయిదా వేసే ధోరణి పెద్దసమస్య. మెదడు 'ఈ రోజే చదవాలి' అంటే, మనసు 'రేపు చదువుదాం' అంటుంది. ఆర్థిక సమస్యలు, కుటుంబ వివాదాలు, నిద్రలేమి, ఆందోళన, ఒత్తిడి దీనికి కారణాలు. చేయాల్సిన పనిని వాయిదా వేయడం తాత్కాలిక ఉపశమనం ఇచ్చినా, దీర్ఘకాలంలో చేటు చేస్తుంది. ఇది స్వీయ నియంత్రణ వైఫల్యమని నిపుణులు చెబుతున్నారు. చేస్తున్న పనివల్ల ప్రయోజనమేమిటో గుర్తిస్తే శ్రద్ధ కుదురుతుంది. పనిని విభజించి, సబ్జెక్టుల వారీగా సమయ ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు వస్తాయి. డిజిటల్ ప్రపంచ ఆకర్షణ నుంచి దూరంగా ఉండటానికి చదివేటప్పుడు ఫోన్‌ను వేరే గదిలో పెట్టాలి. అలాగే నేడు కృత్రిమమేధ (ఏఐ)ప్రతి రంగంలోకి ప్రవేశించింది. పాఠశాల స్థాయి నుంచే ఏఐ బోధన అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచంలో కొన్ని దేశాలు ఏఐ అవగాహన పెంపొందిస

నా ఫోన్ ట్యాప్ చేశారు

- నా దగ్గర అన్ని ఆధారాలున్నాయి
- విపక్ష నేత రాహుల్ సంచలన ఆరోపణలు
- మోడీతో ముఖాముఖి చర్చకు సిద్ధమే



న్యూఢిల్లీ, నవంబరు 13: ప్రధాన మంత్రి మోడీపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మోడీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నార ఆరోపించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ ఇంటరాక్టివ్ సెషన్‌లో రాహుల్ మాట్లాడుతూ.. "ఆధారాలన్నీ ఈ ఫోన్‌లోనే ఉన్నాయి. నా ఫోన్‌ను ట్యాప్ చేస్తున్న విషయం ప్రధానికి కూడా ఈ విషయం తెలుస్సు అని రాహుల్ తన మొబైల్ పైకి చూపిస్తూ అన్నారు. తన ఫోన్ ట్యాపింగ్ అవుతోందన్న ఆరోపణలను ధ్రువీకరించే ఎలాంటి సాంకేతిక ఆధారాలను మాత్రం ఆయన ఈ సందర్భంగా వెల్లడించలేదు. ప్రధానితో నేరుగా బహిరంగ చర్చ జరపాలన్న తన డిమాండ్‌ను మరోసారి వినిపించారు. విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరున్నారు, దేశ వ్యతిరేకులు ఎవరు అనే ప్రశ్నకు ముఖాముఖి చర్చతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాహుల్ శుక్రవారం పునరుద్ఘాటించారు. రాహుల్ గాంధీ తన అధికారిక 'ఎక్స్'లో వీడియోను షేర్ చేశారు. ఆ పోస్ట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ "మోడీ జీ, మీ సొంత మీడియా 'గోడీ మీడియా' దీపావళి మిలన్‌లో కూడా టెలిప్రాంప్టర్ అవసరమా? అక్కడ ఉన్నది మీ మనుషులు, మీ వేదిక, మీ వాతావరణమే కదా.. అయినప్పటికీ స్క్రిప్ట్ అవసరమైంది. చూస్తుంటే మీరు ఒత్తిడిలో ఆందోళనకు గురైనట్లు కనిపిస్తోంది" అని ఎద్దేవా చేశారు. తనతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసురుతూ.. "సరే, పర్వాలేదు. నాతో జరిగే చర్చకు కూడా మీరు టెలిప్రాంప్టర్ తెచ్చుకోండి, మీకు నచ్చిన వారినే జడ్జిగా కూడా నియమించుకోండి. కానీ ముందు చర్చకు రండి. అసలైన దేశద్రోహి ఎవరో ఈ దేశం తెలుసుకోవాలనుకుంటోంది అని రాహుల్ గాంధీ తన ట్వీట్‌లో ఘాటుగా వ్యాఖ్యానించారు.

భారత్ చొరవతో 'యోగాకు విశ్వఖ్యాతి

బెంగళూరులో ఎస్‌వ్యాస స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధాని మోడీ : 'ప్రశాంతి కుటీరన్ సేవ, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనమని వ్యాఖ్య



బెంగళూరు, నవంబరు 13: భారతీయ ప్రాచీన సంస్కృతికి ప్రతీక అయిన యోగాకు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉన్న స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థ (ఎస్‌వ్యాస) రెసిడెన్షియల్ హెడ్‌క్వార్టర్స్ క్యాంపస్ 'ప్రశాంతి కుటీరన్ స్వర్ణోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ మాట్లాడారు. భారతదేశం తీసుకున్న చొరవ ఫలితంగానే యోగాకు వరల్డ్ స్థాయి గుర్తింపు లభించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. తాను ఏ దేశం వెళ్లినా...అక్కడి వారు యోగా గురించే తనతో చర్చిస్తారని ప్రధాని మోడీ వెల్లడించారు. మన సంస్కృతిని తెలుసుకోవడానికి యోగా ప్రస్తుతం ప్రపంచానికి ఒక గొప్ప మార్గంగా ఉపయోగపడుతోందని ఆయన అభివర్ణించారు. కర్ణాటక భూమికి యోగాతో విడదీయరాని అనుబంధం ఉందని ప్రధాని గుర్తు చేశారు. ఈ గడ్డపై ఎంతోమంది గొప్ప యోగా గురువులు, పండితులు జన్మించారని కొనియాడారు. ఇదే వేదికగా కన్నడ చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ దిగ్గజ నటుడు, కన్నడ రత్న డాక్టర్ రాజ్‌కుమార్‌ను ప్రధాని స్మరించుకున్నారు. దివంగత నటుడు డాక్టర్ రాజ్ కుమార్ నిత్యం యోగా సాధన చేసేవారని, ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు.

ఈ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ డిజిటల్ మాధ్యమం ద్వారా పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బెంగళూరులోని క్యాంపస్‌లో సరికొత్తగా నిర్మించ తలపెట్టిన 'గోల్డెన్ జూబ్లీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్' నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో ఏర్పాటు చేయనున్న నూతన ఎస్‌వ్యాస ఆఫ్‌క్యాంపస్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

"ప్రశాంతి కుటీరన్ స్ఫూర్తిగాథ:

బెంగళూరులో స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థాన్ (ఎస్‌వ్యాస) ప్రధాన కేంద్రం 'ప్రశాంతి కుటీరన్ స్వర్ణోత్సవ వేడుకల్లో మోడీ పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ మాజీ సర్ కార్యవాహ, ప్రముఖ రచయిత హెచ్.వి. శేషాద్రి శతజయంతి (100వ జయంతి) వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోడీ, ఆయన రచించిన ఆరు పుస్తకాల హిందీ, ఆంగ్ల అనువాదాలను ఆవిష్కరించారు. వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి హెచ్.వి. శేషాద్రి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.

అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం

కర్ణాటక గొప్ప వారసత్వ సంపద నడుమ 'ప్రశాంతి కుటీరన్ సాగించిన 50 యేళ్ల ప్రయాణం సేవ, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు తప్పక తెలుసుకోవాల్సిన అద్భుత గాథ ఇదని అభివర్ణించారు. ఒక చిన్న యోగా కేంద్రంగా మొదలై, నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక మహా ఉద్యమంగా ఎదిగిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రధాని మోడీ అభినందించారు.

తైవాన్‌కు జిన్‌పింగ్ హెచ్చరిక

- స్వాతంత్ర్యానికి ఛాన్సే లేదు
- చైనాతో ఏకీకరణ తప్పదు



బీజింగ్, నవంబరు 13: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తైవాన్‌ను చైనా నియంత్రణలోకి తీసుకురావాలనే బీజింగ్ లక్ష్యాన్ని మరోసారి వెల్లడించారు. దేశం 'పూర్తి ఏకీకరణ' చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) చారిత్రక లక్ష్యమని, అది తప్పకుండా సాధ్యమవుతుందన్నారు. బీజింగ్‌లో ప్రముఖ చైనా జాతీయవాద నాయకుడు సన్ యాట్-సెన్ 160వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో షీ జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

కార్యకలాపాలు అనుమతించబోం

తైవాన్ పరిస్థితులు, అక్కడి ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఎలాంటి విభజనవాద కార్యకలాపాలను మాత్రం అనుమతించబోమని తేల్చి చెప్పారు. చైనా అధికారిక వార్తా సంస్థ షిన్హువా ప్రకారం..తైవాన్ సమస్య పరిష్కారం, దేశ ఏకీకరణ అనేది చైనా ప్రజలు ఉమ్మడి ఆకాంక్ష మాత్రమే కాకుండా, దేశ పునరుజ్జీవన లక్ష్యంలో కీలక భాగమని షీ జిన్‌పింగ్ అన్నారు. తైవాన్ జలసంధికి ఇరువైపులా ఉన్న ప్రజలు, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న చైనా సమాజాలు కలిసి తైవాన్ స్వాతంత్ర్యాన్ని సమర్థించే శక్తులను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. వన్-చైనా సూత్రం, అలాగే 1992 కన్సెన్సస్‌ను అంగీకరిస్తే, తైవాన్‌లోని వివిధ వర్గాల ప్రజలతో తైవాన్ సంబంధాలు, జాతీయ ఏకీకరణ అంశాలపై చర్చలు, సంప్రదింపులు జరపడానికి చైనా సిద్ధంగా ఉందని తెలిపారు.

పరిగణనలోకి భావోద్వేగాలు

తవాన్‌లోని వాస్తవ పరిస్థితులు, ప్రజల ప్రయోజనాలు, వారి భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుంటామని జిన్‌పింగ్ చెప్పారు. ఎలాంటి విభజనవాద చర్యలను చైనా అనుమతించదని స్పష్టం చేశారు. 'మాతృభూమి పూర్తి ఏకీకరణ తప్పనిసరిగా సాధించాలి.. అది ఎటువంటి సందేహం లేకుండా సాధ్యమవుతుంది' అని షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు.

ఆర్ఎసి టికెట్లు బంద్?

■ రైల్వే శాఖ తాజా యోచన

న్యూఢిల్లీ, నవంబరు 13: ప్రయాణికుల నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో ఆర్ఎసి టికెట్లను క్యాన్సిల్ చేయాలని రైల్వేశాఖ యోచిస్తున్నట్లు వార్తలు వినిఎ స్తున్నాయి. ప్రయాణికుల సౌకర్యాలపై ఫిర్యాదులు వస్తున్న క్రమంలో ఆర్ఎసి విధానాన్ని తొలగించే అంశాన్ని పరిశీలిస్తోన్నట్లు సమాచారం. ఒకే బెర్త్‌ను ఇద్దరికి కేటాయించినప్పుడు పూర్తి ఛార్జీలు వసూలు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇది తప్పనే అభిప్రాయలు ఎప్పటినుంచో వివిధ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఒకే సీటును ఒక పురుషుడు, ఒక మహిళకు కేటాయించినప్పుడు మరింత ఇబ్బందిగా ఉంటుంది. ఆర్ఎసి వ్యవస్థ అన్యాయమైనదని, పూర్తి బెర్త్ లభించని పక్షంలో ప్రయాణికుడికి టికెట్ ఛార్జీలో పాక్షి కంగా కొంతమొత్తం రీఫండ్ చేయాలని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఒక నివేదికలో పబ్లిక్ అకౌంట్ కమిటీ సూచించింది.ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా ఎక్కువమంది టికెట్లను బుకింగ్ చేసుకుంటున్న తరుణంలో ఆర్ఏసీ వ్యవస్థ అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి బదులుగా పూర్తి బెర్త్‌లు కేటాయించడం లేదా ఆర్ఎసి టికెట్లకు పాక్షి కంగా నగదు వాపసు చేయడం, బెర్త్‌ల కేటాయింపును మెరుగుపర్చడానికి ప్రత్నామ్నాయ అప్‌గ్రేడ్ ఏర్పాటు చేయడం లేదా ఆర్ఎసి కోటాను పూర్తిగా రద్దు చేయడం వంటి రైల్వేశాఖ పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. రైల్వేశాఖ నుంచి దీనికి సంబంధించి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. కేవలం ప్రతిపాదన దశలో ఇది ఉన్నట్లు కొన్ని వర్గాలు చెబుతున్నాయి. ఇది ఎంతవరకు నిజమనేది రైల్వేశాఖ నుంచి ప్రకటన వస్తే కానీ తెలియదు.

ఇరాన్, అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తత

బహ్రెయిన్‌లో యుఎస్ రాడాన్‌ను ధ్వంసం చేశాం : ఐఆర్‌జిసి

టెహ్రాన్, నవంబరు 13: ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా దాడులు చేస్తే తీవ్రంగా ప్రతిస్పందిస్తామని ఇప్పటికే హెచ్చరిస్తున్న ఇరాన్ తాజాగా మరో సంచలనం ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో ఉన్న అమెరికా ముందస్తు హెచ్చరిక రాడార్ వ్యవస్థను ధ్వంసం చేసినట్లు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ప్రకటించింది. అమెరికాకు ఇది తీవ్రమైన హెచ్చరిక అని పేర్కొంది. మరోసారి ఇరాన్‌పై దాడులు చేసినా, తమ సరిహద్దులను ఉల్లంఘించినా గతంలో కంటే మరింత కఠినంగా బదులిస్తామని హెచ్చరించింది. ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతంలో ఉన్న టెలికమ్యూనికేషన్ టవర్‌పై అమెరికా వైమానిక దాడి చేసిందని ఐఆర్‌జిసి ఆరోపించింది. దీని ప్రతీకారంగా తమ



ఏరోస్పేస్ దళాలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. అమెరికా దాడి జరిగిన గంటలోపే బహ్రెయిన్ ద్వీపంలో ఉన్న అమెరికా సైన్యానికి చెందిన ఎర్లీ వార్నింగ్ రాడార్ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్టు ఐఆర్‌జిసి తన ప్రకటనలో పేర్కొంది. తమపై దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించడమే ఈ చర్య వెనుక ఉద్దేశమని తెలిపింది. హార్మూజ్ జలసంధి ప్రాంతంలో అమెరికా చమురు అక్రమ రవాణాకు పాల్పడుతోందని కూడా ఇరాన్ ఆరోపించింది. తమ దేశ సరిహద్దులను మరోసారి ఉల్లంఘించి, దూకుడు చర్యలకు పాల్పడితే తీవ్రంగా స్పందిస్తామని ఐఆర్‌జిసి అమెరికాకు హెచ్చరిక జారీ చేసింది. బహ్రెయిన్‌లోని అమెరికా రాడార్‌ను ధ్వంసం చేయడం శత్రువులకు ఇచ్చిన తీవ్రమైన హెచ్చరిక మాత్రమేనని పేర్కొంది. అమెరికా వైమానిక కవ్వింపు చర్యలు, హార్మూజ్ జలసంధిలో చమురు అక్రమ రవాణాను అడ్డుకోవడమే తమ లక్ష్యమని వెల్లడించింది. అమెరికా మరోసారి దూకుడుగా వ్యవహరిస్తే తమ ఏరోస్పేస్ దళాలు ఎలాంటి పరిమితులు లేకుండా ప్రతి స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఐఆర్‌జిసి స్పష్టం చేసింది.

జకీర్ నాయక్ సంస్థపై మరో ఐదేళ్లు నిషేధం

హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త: వివాదాస్పద ఇస్లామిక్ మత ప్రబోధకుడు డాక్టర్ జకీర్ నాయక్ నేతృత్వంలోని ఇస్లామిక్ రీసర్చ్ ఫౌండేషన్ (ఐఆర్ఎఫ్)పై కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటు నిషేధాన్ని పొడిగించింది. కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం 1967 కింద ఐఆర్ఎఫ్‌ను చట్టవిరుద్ధమైన సంస్థగా పేర్కొంటూ ఈ నిర్ణయం తీసుకుంది. దేశ భద్రతకు విఘాతం కలిగించడం, మత సామరస్యాన్ని దెబ్బతీయడం ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు హోం శాఖ స్పష్టం చేసింది. ఐఆర్ఎఫ్ కార్యకలాపాలు దేశ లౌకిక నిర్మాణాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు అయిన జాకీర్ తన ప్రసంగాల ద్వారా వివిధ మత వర్గాల మధ్య శత్రుత్వం, విద్వేషాలను ప్రోత్సహిస్తున్నారని హోం శాఖ వెల్లడించింది. అంతర్జాతీయ శాటిలైట్ టీవీ నెట్‌వర్క్, ఇంటర్నెట్, సోషల్ మీడియా ద్వారా జాకీర్ నాయక్ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి తన తీవ్రవాద, రాడికల్ ప్రసంగాలను చేరవేస్తున్నారని కేంద్రం పేర్కొంది. మొదట 2021 నవంబర్ 15న ఐఆర్ఎఫ్‌పై కేంద్రం నిషేధం విధించింది.

అమెరికాలో రికార్డు స్థాయిలో బహిష్కరణలు

యేడాదిలోనే 4.83 లక్షల మంది డిపోర్ట్

వాషింగ్టన్, నవంబరు 13: అమెరికాలో వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం అనురిస్తున్న కఠిన వైఖరి మరోసారి స్పష్టమైంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 'ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్' (ఐసిఇ) ఏజెన్సీ చరిత్రలోనే అత్యధిక స్థాయిలో వలసదారులను దేశం నుంచి బహిష్కరించడంతోపాటు అరెస్టులు కూడా చేపట్టింది. ఈ మేరకు యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారికంగా గణాంకాలను విడుదల చేసింది. హోంల్యాండ్ సెక్యూరిటీ వివరాల ప్రకారం.. 2026 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 4,83,200 మందిని దేశం నుంచి బహిష్కరించారు. 'ఐస్' ఏజెన్సీ 23 యేళ్ల చరిత్రలో ఇదే అత్యధికం. గత యేడాది నమోదైన 4,42,640 బహిష్కరణల రికార్డును ఇది అధిగమించింది. ఇదే సమయంలో అరెస్టుల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 4,91,000 దాటింది. వీటిలో 4,75,000 అడ్మినిస్ట్రేటివ్ అరెస్టులు న్నాయి. ఈ యేడాది ఆగస్టులో 50,925 మందిని అరెస్టు



చేయగా, సెప్టెంబరు నెలలో 48,000కు పైగా అరెస్టులు నమోదయ్యాయి.

ట్రంప్ ప్రభుత్వం వలస విధానాలపై తీసుకున్న చర్యల కారణంగానే ఈ రికార్డు స్థాయి అరెస్టులు, బహిష్కరణలు సాధ్యమయ్యాయని హోంల్యాండ్ సెక్యూరిటీ మంత్రి మార్క్‌వేన్ ముల్లిన్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోని మూడు పూర్తి ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన మొత్తం అరెస్టులు, బహిష్కరణల కంటే ఈ యేడాది గణాంకాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ ప్రకటన వెలువడటానికి కొద్ది రోజుల ముందు అధ్యక్షుడు డొనాల్డ్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ వలస విధానాలు 'కొంత కఠినంగా ఉండవచ్చని' అంగీకరించారు. చట్టవి రుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన వారిని తొలగించే ప్రయత్నాలను ఆయన సమర్థించుకున్నారు.

కాంగ్రెస్‌లో పట్టు పెంచుకుంటున్న డెమోక్రాట్లు ఈ పరిణామాలపై దృష్టి సారించారు. 'ఐస్' ఏజెన్సీ అనుసరిస్తున్న పద్ధతులు, కఠిన నిబంధనలపై సమీక్ష జరపాలని యోచిస్తున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు. విడుదలైన డేటాలో దేశ సరిహద్దుల్లో పట్టుబడిన వారు, దేశ అంతర్గతంగా అరెస్టు అయిన వారి మధ్య స్పష్టమైన విభజన లేదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. దీంతో వలసదారులపై ప్రభుత్వ చర్యల పూర్తి స్వరూపంలో కొంత అస్పష్టత నెలకొంది.

ఎల్‌నినోతో హెల్త్ ఎమర్జెన్సీ

భారత్‌కు డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక

జెనీవా, నవంబరు 13: ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వడగాలులు, కరవు, అంటువ్యాధులు, ఆహార కొరత వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) హెచ్చరించింది. ఈ ముప్పును దృష్టిలో ఉంచుకుని అత్యున్నత స్థాయి అత్యవసర స్పందనను ప్రారంభించింది. భారత్‌ను అధిక లేదా అత్యధిక ఆరోగ్య ముప్పు ఎదుర్కొనే దేశాల జాబితాలో చేర్చింది. దక్షిణాసియాలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరమని స్పష్టం చేసింది.ఎల్‌నినో నేరుగా వ్యాధులకు కారణం కాదని, వాతావరణ పరిస్థితులను మార్చి ఆరోగ్య సమస్యలు పెరిగేలా చేసే ప్రమాద కారకమని డబ్ల్యూహెచ్ఓ వివరించింది. ప్రపంచ ఆరోగ్య పరిస్థితుల అంచనాలో భారత్‌ను అధిక లేదా అత్యధిక ముప్పు ఉన్న దేశంగా గుర్తించింది. బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులకూ ఇదే తరహా ప్రమాదాలున్నాయని పేర్కొంది.



తీవ్ర ఉష్ణోగ్రతలు: వడగాలుల వల్ల డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండె, శ్వాసకోశ, మూత్రపిండాల సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారికి ముప్పు ఎక్కువ.

డెంగీ, మలేరియా: ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు దోమల వ్యాప్తిపై ప్రభావం చూపుతాయి. నీటి కొరతతో ఇళ్లలో నిల్వ చేసే నీటి పాత్రలు దోమల పెరుగుదలకు కారణం కావచ్చు. ఈశాన్య భారతంలో మలేరియా ముప్పునూ నివేదిక ప్రస్తావించింది. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు: వరదలు, పారిశుద్ధ్య సమస్యల వల్ల తాగునీరు కలుషితమై లెప్టోస్పిరోసిస్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది.

పోషకాహార లోపం: వర్షాలు తగ్గితే పంటల దిగుబడి, వ్యవసాయ ఆధారిత ఉపాధి దెబ్బతింటాయి. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార సమస్యలు పెరిగే అవకాశం ఉంది.తీవ్ర వాతావరణ పరిస్థితులు ఆసుపత్రులు, ఔషధ సరఫరా వ్యవస్థలను ప్రభావితం చేయవచ్చు. మధుమేహం, గుండె, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారికి చికిత్స అందడంలో ఇబ్బందులు తలెత్తవచ్చు.

ఎవరికి ఎక్కువ ప్రమాదం?

పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, వైకల్యాలున్నవారు, అనారోగ్య సమస్యలున్నవారు ప్రభావితమయ్యే అవకాశముంది. మురికివాడలు, మారుమూల ప్రాంతాల్లో నివసించేవారికి సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, చల్లదనం కల్పించే సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం మరో సమస్య. వ్యవసాయ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, వీధి వ్యాపారుల వంటి బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు వడగాలుల బారిన పడే ప్రమాదం ఉంది. ఉపాధి కోల్పోవడం, ఆహార కొరత, పరిణామాలు మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూవచ్చని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.

చెన్నైలో వినూత్న ప్రాజెక్ట్

భవనం మధ్యలోంచి దూసుకెళ్లనున్న మెట్రో రైలు

చెన్నై, నవంబరు 13: చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్) ఓ వినూత్న ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. తిరుమంగళం మెట్రో స్టేషన్ సమీపంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి రూ.446.88 కోట్ల విలువైన కాంట్రాక్టును ఖరారు చేసింది. భవనాల మధ్యలో నుంచే మెట్రో రైలు వయాడక్ట్ వెళ్లడమే ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. చెన్నై మెట్రో ఫేజ్2లో భాగంగా ఈ నిర్మాణం రూపుదిద్దుకోనుంది. కెపాసిటే ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ లిమిటెడ్ దీనిని దక్కించుకుంది. తిరుమంగళం మెట్రో స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న 3.85 ఎకరాల స్థలంలో నిర్మాణాలు జరగనున్నాయి. కారిడార్ 5 వెంట చేపట్టనున్న ఈ పనులను, ప్రాజెక్ట్ ప్రారంభమైన నాటి నుంచి 24 నెలల్లో పూర్తి కావాలి.ఈ ప్రాజెక్టులో భాగంగా నాలుగు టవర్లను నిర్మిస్తారు. టవర్ ఎ, సిలలో మూడు బేస్‌మెంట్లు, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 9 అంతస్తులు ఉంటాయి. టవర్ బిలో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి 9 అంతస్తులు, టవర్ డీలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంత స్తులు నిర్మిస్తారు. ఫేజ్2లో భాగంగా నిర్మించే కొత్త తిరుమంగళం మెట్రో స్టేషన్, టవర్ బీ, సీల మధ్యలో ఉంటుంది.

సంక్షిప్త వార్తలు

'నేనొక పనికిమాలిన వాడిని: జెన్సన్



వాషింగ్టన్, నవంబరు 13: టెక్నాలజీ ప్రపంచంలో ఒక సంచలనంలా దూసుకెళ్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ ఎన్విడియాలో ఒక శకం ముగిసింది. మూడు దశాబ్దాలకు పైగా కంపెనీకి తిరుగులేని నాయకుడిగా, వ్యవస్థాపకుడిగా ఉన్న జెన్సన్ హువాంగ్ తన సీఈవో పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో వారాల పాటు తన పదవిని కాపాడుకునేందుకు పోరాడిన ఆయన, చివరికి ఓటమిని అంగీకరించి తప్పుకున్నారు. హువాంగ్ రాజీనామాకు దారితీసిన నాటకీయ పరిణామాలపై ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ 'బ్లూమ్‌బర్గ్' ఒక సవివరమైన కథనాన్ని ప్రచురించింది.

నోట్లో పేలిన రసగుల్లా.. ఒకరి మృతి

భోపాల్, నవంబరు 13: మధ్యప్రదేశ్‌లోని డిండోరి జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. దీపావళి పండుగ వేడుకల వేళ నోట్లో రసగుల్లా పేలడంతో వ్యక్తి మృతి మృతి చెందాడు. పొరుగింటి వ్యక్తి 'రసగుల్లా అని నమ్మించి ఇచ్చిన నాటుబాంబును నోట్లో వేసుకుని కొరకడంతో.. అది ఒక్కసారిగా పేలడంతో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అడవి పందులను వేటాడేందుకు ఉపయోగించే అత్యంత శక్తిమంతమైన నాటుబాంబును మిఠాయి రూపంలో ఇచ్చి ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటనపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 105, పేలుడు పదార్థాల చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రామ్‌భగత్‌ను అరెస్ట్ చేశారు.

మైక్రోసాఫ్ట్ సర్వర్ డౌన్ : ప్రపంచమంతా నిలిచిన సేవలు

